అవినీతిని, అక్రమాలను చూస్తూ ఉరుకోవడమే అతి పెద్ద పాపం..

చైతన్య వారధి
ఛారిటబుల్ ట్రస్టు(ప్రజా చైతన్యం కోసం)

# చైతన్య వారధి
తెలుగు దిన పత్రిక
RNI.No.APTEL \ 2006 \18521
website:www.cvdaily.in
CHAITANYA VARADHI TELUGU DAILY
Simultaneously Published from Visakhapatnam, Vizianagaram, Ananthapur and Guntur

VISAKHAPATNAM | సంపుటి: 19 | సంచిక: 140 | ఆదివారం | 16-11-2025 | ఎడిటర్ : బి.గోపీనాథరావు | పేజీలు : 8 | వెల : 1.00

చైతన్యవారధి పత్రికకు జిల్లాలో ప్రతి మండల కేంద్రం నుంచి రిపోర్టర్లు కావలెను. స్థానిక రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన ఉండి, ప్రజా సమస్యలను వార్తల రూపంలో వెలుగులోకి తేవాలన్న ఆసక్తి ఉన్న యువకులకు ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్రదించండి - 9848682422

## ఆధార్ కేవలం గుర్తింపు పత్రమే

**- పౌరసత్వ నిర్ధారణకు, ఓటర్ల జాబితా కోసమో వినియోగించరాదు**

**- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం**



దిల్లీ: ఆధార్ కార్డును గుర్తింపు కోసమే వినియోగించాలని, పౌరసత్వ నిర్ధారణ కోసమో, బిహార్‌లో సవరించిన ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చుడానికో. తొలగించ డానికో ఉపయోగించ రాదని ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. 1950నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 23(4) సెక్షన్ ప్రకారం ఆధార్‌ను వ్యక్తిగత గుర్తిం పునకు, ధ్రువీకరణకు మాత్రమే వినియోగించేలా ఉత్తర్వులు జారీచేయాలని న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు సెప్టెంబరు 8న సరిగ్గా ఇదే ఆదేశం జారీచేసిందని కేంద్ర ఎన్నికల కమిషన్ వివరించింది. ఆ ఆదేశాలను పాటించాలంటూ బిహార్ ప్రధాన ఎన్నికల అధికారికి సెప్టెంబరు 9న తాము సూచించామని తెలిపింది. ఆధార్ పౌరసత్వ ధ్రువీకరణకు కానీ, పుట్టిన తేదీ, చిరునామాల నిర్ధారణకు కానీ వాడరాదని 2023లోనే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ స్పష్టం చేసిన సంగతినీ గుర్తుచేసింది.

## ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి

# డ్రోన్లతో పహారా

**- వైకాపా హయాంలో లక్షల చెట్లు నరికేశారు**

**- అధికారుల సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**



అమరావతి: వైకాపా హయాంలో లక్షల ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తరలించారని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పారు. మన రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా అయిన ఎర్రచందనం దుంగలు దేశంలో ఎక్కడ దొరికినా అవి మనకే చెందేలా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక ఆదేశాలు ఇప్పించినట్లు గుర్తుచేశారు. ఎర్రచందనం పరిరక్షణ, అక్రమ రవాణా నిరోధంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. “2015లో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి అప్పటి తెదేపా ప్రభుత్వం కృషి చేసింది. అప్పట్లో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. అటవీ, పోలీసు శాఖల సమన్వయంతో థర్మల్ డ్రోన్లు ఏర్పాటు చేసి నిఘా పెంచాలి. 2 వ పేజీలో...

# ‘ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్’ను తిరస్కరించారు

**- దేశానికి ఇది శుభసూచకం**

**- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి**



సూరత్: ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్ గా మారిన కాంగ్రెస్ పార్టీని బిహార్ ప్రజలు పూర్తిగా తిరస్కరించారని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని అన్నా రు. కులవాదం అనే విషాన్ని చిమ్మిన ప్రతిపక్షా నికి కర్రుకాల్చి వాత పెట్టారని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని సూరత్‌లో బిహారీలు నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. బిహార్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్డీయే విజయం సాధించినందుకు బిహారీలు మోదీని ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ) చర్యలను చూసి ఆ పార్టీలోని సీనియర్ నాయకులు బాధపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు దశాబ్దకాలంగా ఎన్నికల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆ పార్టీ నాయకత్వానికి సూచించారు. కాంగ్రెస్‌ను కాపాడుకోవడం ఇక కష్టమేనని పార్టీ నాయకులే అంటున్నారని గుర్తుచేశారు. దాదాపు 60 ఏళ్లు దేశాన్ని పాలించిన పార్టీకి ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని చెప్పారు.

అక్రమాలను అడ్డుకోవడానికే వక్ఫ్ చట్టం... బిహార్‌లో ఎన్డీయే ఘన విజయానికి ఎం.వై.(మహిళలు, యువత) అంశమే కారణమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. నేరాలు చేసి, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన కొందరు నేతలు కుల రాజకీయాలతో ఎన్నికల్లో నెగ్గాలని ఆరాట పడ్డారని విమర్శించారు. వారి ఆటలు సాగలేదని, జనం వారి కుట్రలను తిప్పికొట్టారని ప్రశంసించారు. దేశానికి ఇదొక శుభసూచకమని పేర్కొన్నారు. బిహార్‌లో అన్ని వర్గాల ప్రజలూ ఎన్డీయేకు అండగా నిలిచారని తెలిపారు. అధికార, విపక్ష కూటముల మధ్య 10 శాతం ఓట్ల తేడా ఉందన్నారు. బిహార్‌లో 38 నియోజకవర్గాల్లో దళితుల ప్రాబల్యం అధికంగా ఉండగా, అందులో 34 స్థానాలు ఎన్డీయే గెల్చుకుందని వివరించారు. దళితులు విపక్షాన్ని తిరస్కరించారని చెప్పారు. బిహార్‌లో భూములను, ఇళ్లను చట్టవిరుద్ధంగా ఆక్రమించి అవి వక్ఫ్ ఆస్తులు అంటున్నారని ప్రధానమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమిళనాడులో వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన గ్రామాలు వక్ఫ్ ఆస్తులు ఎలా అవుతాయో చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికే వక్ఫ్ చట్టం తీసుకొచ్చామని వివరించారు. అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని అమలు కానివ్వబోమని ప్రతిపక్షాలు ప్రకటించాయని, అయినా బిహార్ ఓటర్లు పట్టించుకోలేదని అన్నారు. బిహార్‌లో ఓటమికి కారణాలు చెప్పలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలపై, ఎన్నికల సంఘంపై నిందలు వేస్తోందని ధ్వజమెత్తారు. ఇలాంటి నిందలతో ఎక్కువ రోజులు కార్యకర్తలను మభ్యపెట్టలేరని హితవు పలికారు.

## జంగిల్‌రాజ్ భయంతో మా ఓటర్లు ఎన్డీయేకి ఓటేశారు

**- ప్రశాంత్ కిశోర్**



పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన మాజీ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ఎన్డీయే గెలుపుపై తనదైన విశ్లేషణ చేశారు. ఆర్జేడీ సారథ్యంలోని మహాగఠ్ బంధన్ అధికారంలోకి వచ్చిన పక్షంలో జంగిల్ రాజ్ మళ్లీ వస్తుందనే భయంతో తమ పార్టీ ఓటర్లు కొందరు ఎన్డీయే పక్షాల అభ్యర్థులకు ఓటు వేశారని వివరించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనతో సీమాంచల్ ప్రాంతంలోని ఓట్లన్నీ ఒకే పక్షానికి గంపగుత్తగా పడ్డాయని ఆ పార్టీ నేత ఉదయ్ సింగ్ చెప్పారు. వీరిద్దరూ శనివారం పట్నాలో మీడియాతో మాట్లాడారు. జంగిల్ రాజ్ ఉందని తాను చెప్పలేనన్న ప్రశాంత్ కిశోర్..తమ పార్టీ ఓటర్లు మాత్రం ఆ భయం వల్లే ఎన్డీయేకు ఓటేశార న్నారు. కాంగ్రెస్‌తోగానీ, మహాగఠ్ బంధన్‌లోని ఏ ఇతర పార్టీతోనూ లేని ఇబ్బంది ఆర్జేడీతో ఉన్నట్లుగా ప్రజలు భావించారని తెలిపారు. ముస్లిం వర్గం తమను ఇంకా పూర్తిగా నమ్మలే దంటూ ఆయన..దీర్ఘకాలంలో వారి మద్దతుల భిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.40 వేల కోట్లను ఎన్డీయే ప్రభుత్వం వెదజల్లిందన్నారు. ప్రపంచబ్యాంకు నుంచి రుణంగా తెచ్చిన రూ.14 వేల కోట్లను సైతం ఉచితాల మళ్లించారని ఆరోపించారు.

## ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం

**- కీలక రంగాల్లో సహకారం అందించండి - వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఎండీ జెరెమీ జుర్గెన్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ**




విశాఖపట్నం: ఏపీని ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సీఐఐ సదస్సులో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. “పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. దేశ గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యంలో 30% ఏపీలోనే సాధించాలన్నది మా లక్ష్యం. మీ వంతు సహకారం అందించాలి’ అని కోరారు. “సైబర్ సెక్యూరిటీ జాతీయ భద్రతలో కీలకం. ప్రపంచవ్యాప్తంగా 2033 నాటికి సైబర్ దాడులు సమారు లక్ష కోట్ల డాలర్ల నష్టం కలిగించొచ్చని అంచనా. ఇది చాలా ఆందోళనకరమైన విషయం. ఐటీ హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది సైబర్ నిపుణుల లోటును తీర్చే అవకాశం మాకు ఉంది. చమురు, సహజవాయువు, విద్యుత్తు లాంటి కీలక రంగాల్లో సైబర్ సెక్యూరిటీ నమూనాలను అమలు చేయడంలో సహకారాన్ని అందించండి” అని కోరారు.

పారిశ్రామిక విప్లవం-4.0లో ఏపీ ప్రధాన పాత్ర.... “ప్రపంచ ఆర్థిక వేదిక అభివృద్ధి చేసిన ‘స్ట్రాటెజిక్ సైబర్ సెక్యూరిటీ టాలెంట్ ఫ్రేమ్‌వర్క్’ను ప్రయోగాత్మకంగా అమలుచేసి, సైబర్ సెక్యూరిటీ టాలెంట్ పూల్‌ను ప్రోత్సహించండి. పారిశ్రామిక విప్లవం-4.0లో 2 వ పేజీలో...

## ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం

**- మంత్రులు, అధికారులు కలిసి పని చేయడంతో భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్**

**- 45 దేశాల్లో విశాఖ పేరు మార్మోగుతోంది - అభినందన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



విశాఖపట్నం: ఐదేళ్లల్లో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంత్రులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయడంతోనే భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్ అయిందని వెల్లడించారు. విశాఖపట్నం సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు అనంతరం మంత్రులు, అధికారులు, ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. సీఎం అందరికీ జ్ఞాపికలు అందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “సీఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. బృందంగా కలిసి పనిచేయడం వల్లే 45 దేశాల్లో మన భాగస్వామ్య సదస్సు, విశాఖ పేరు మార్మోగుతోంది. ఈ సదస్సులో అర్థవంతమైన, విజ్ఞానవంతమైన చర్చలు జరిగాయి. దావోస్‌లో ఒప్పందాలు బయట జరుగుతాయి. ప్రపంచం ఏ దిశగా ముందుకెళుతోంది.. భవిష్యత్తు ఏవిధంగా ఉంటుంది.. ఎదురయ్యే సవాళ్లు.. అందివచ్చే అవకాశాలపై ప్రధాన ప్రాంతంలో చర్చిస్తారు. కానీ, వినూత్న పద్ధతిలో విశాఖ సదస్సుకు మనం శ్రీకారం చుట్టాం. ఎవరికి ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే ఆ సెమినార్‌కు వెళ్లే అవకాశం కల్పించాం” అని తెలిపారు.

సదస్సులో అంతా ప్రణాళికతో నిర్వహించారని, విదేశీ ప్రతినిధులకు విమానాశ్రయంలో ఆహ్వానం పలకడం నుంచి వాళ్లను తిరిగి పంపించే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించిందని చంద్రబాబు ప్రశంసించారు. “ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నాం. మోదీ బలమైన నాయకుడు అనే భావన ప్రపంచమంతా ఉంది. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది. పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో అధికారులు కలిగించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పునిచ్చారు. విధ్వంస పాలనకు చరమగీతం పలికారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం” అని తెలిపారు.

సంపాదకీయం

# బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు

వాడవాడలా విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలు చిన్నాపెద్దా అందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధానంగా చిన్నపిల్లలపై అవి క్రూరంగా దాడి చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. మొన్న జులైలో నంద్యాల జిల్లా బనగానపల్లి మండలంలో ఇంటిముందు ఆడుకుంటున్న బాలికను అలాగే పొట్టన పెట్టుకున్నాయి. అదే నెలలో మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో మూడేళ్ల బాలుణ్ని రాకాసి శునకాలు మూకుమ్మడిగా చుట్టుముట్టి చంపేశాయి. అంతకు ముందు గుంటూరులో వీధికుక్క నాలుగేళ్ల బాలుడి మెడపట్టి ఈడ్చుకెళ్లడంతో పాపం ఆ పిల్లాడికి అప్పుడే నూరేళ్లు నిండిపోయాయి. కొద్దిరోజుల క్రితం మెదక్ జిల్లా తూప్రాన్‌లో శునకాలు ఒకేరోజు పాతిక మందిని గాయపరిచాయి. ఇటీవల ప్రపంచ పారాఅథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ సమయంలో దిల్లీ స్టేడియం దగ్గరే వీధికుక్కలు జపాన్, కెన్యా కోచ్‌లను కరిచాయి. ఎక్కడికక్కడ వాటి విజృంభణ తీవ్ర సమస్యగా పరిణమించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధికుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించి సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని ఆదేశించింది. వీధిశునకాల జనాభాను కట్టడి చేయడంలో యంత్రాంగం చేతకానితనమే ప్రజాభద్రతకు పెనుముప్పుగా మారిందిప్పుడు. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా కోటిన్నరకు పైగా వీధి కుక్కలున్నాయి. సందుగొందుల్లో యథేచ్ఛగా విహరిస్తున్న వాటి సంఖ్య వాస్తవంలో అంతకు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని పరిశీలనలు చాటుతున్నాయి. అధికారిక గణాంకాల మేరకు నిరుడు దేశీయంగా 37లక్షలకు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి 21శాతం అధికం! గడిచిన మూడేళ్లలో తెలంగాణలో 3.33 లక్షల మంది కుక్కకాట్ల బారినపడ్డారు. అదే కాలవ్యవధిలో ఏపీలో అంతకు రెట్టింపు మంది ఆ నరకలోకపు జాగిలాల ఉన్మాద ప్రకోపాలకు బాధితులయ్యారు. సుప్రీంకోర్టు గత ఉత్తర్వులను అనుసరించి స్థానిక సంస్థల అధికారులు వీధి శునకాలకు రేబిస్ టీకాలు వేయించి, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. కానీ– యంత్రాంగం అలక్ష్యం, సిబ్బంది–నిధుల లేమివల్ల అవేమీ అంతగా ఆచరణకు నోచుకోవట్లేదు. దాంతో కుక్కకాట్లు, రేబిస్ మరణాలు అధికమవుతున్నాయి. ప్రాణాంతక రేబిస్ విశ్వవ్యాప్తంగా ఏటా 60వేల మందిని కబళిస్తోంది. వారిలో 36శాతం భారతీయులు కావడం దురదృష్టకరం. ప్రభుత్వాసుపత్రుల్లో రేబిస్ టీకాల కొరతకు తోడు అవగాహన లోపంతో చాలా మంది నాటువైద్యాన్ని ఆశ్రయిస్తుండటం ప్రాణాలపైకి తెస్తోంది. వీధికుక్కల గుంపుల స్వైరవిహారంతో బయటికి రావాలంటేనే చాలాచోట్ల జనం భీతిల్లుతున్నారు. వాటికి జడిసి పెద్దలు వాకింగ్ మానేస్తున్నారు. పిల్లలు పార్కులూ మైదానాల్లో ఆటలకు దూరమవుతున్నారు. అంతిమంగా ఇది ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోంది. కుక్కలు భీకరంగా అరుస్తూ వాహనదారులను వెంబడిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 'స్వచ్ఛభారత్' అమల్లోకి వచ్చాక దేశవ్యాప్తంగా బహిరంగ మలవిసర్జన తగ్గింది. కానీ, వీధికుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతూ పరిసరాలను పాడుచేస్తుండటం లేనిపోని రోగాలకు అంటుకట్టే ప్రమాదముంది. 2030కల్లా దేశంలోంచి రేబిస్‌ను తరిమికొట్టాలన్నది కేంద్రం లక్ష్యం. అది సాకారం కావాలంటే శునకాల సంతాన నియంత్రణకు ప్రభుత్వాలు తగినంతగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో రేబిస్ టీకాలను విరివిగా అందుబాటులో ఉంచాలి. నానా రకాల చెత్త, ఆహార వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వీధికుక్కల సంతతిని ఇబ్బడిముబ్బడి చేస్తుందని ప్రజలూ గుర్తించాలి.

## గొప్పూరులో బిర్సాముండా జయంతి వేడుకలు



మాడుగుల: శంకరం పంచాయతీలో నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీలకు జల్ జమీన్ జంగిల్‌పై పూర్తి అధికారాల కోసం ఆదివాసులంతా పోరాడాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదో సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు ఇరటా నరసింహమూర్తి అన్నారు. గొప్పూరులో బిర్సా ముండా 150వ జయంతి కార్యక్రమాన్ని గిరిజనులతో కలిసి ఆయన నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జల్ జమీన్ జంగిల్‌పై ఆదివాసీలకు హక్కు కోసం బిర్సాముండా పోరాడి నాడు విజయం సాధిస్తే నేడు బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు వాటిని కాలరాస్తున్నాయని నరసింహమూర్తి అన్నారు. శంకరం పంచాయతీ పరిధిలో అన్ని గిరిజన గ్రామాల్లో గెడ్డలపై వంతెనలతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.భవాని, సోలం చంద్రశేఖర్, సన్యాసమ్మ పాల్గొన్నారు.

## తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం



పరవాడ: లంకెలపాలెంలోని ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో ఉన్న ఒక తుక్కు దుకాణంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలో నిల్వ చేసిన సామగ్రి పూర్తిగా కాలి బూడిద కావడంతో యజమానికి భారీగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలివి. పరిశ్రమల నుంచి కొనుగోలు చేసిన రసాయన డ్రమ్ములు, ఖాళీ బ్యాగులు, వైర్లు, ఇతర స్క్రాప్ సామగ్రిని ఇక్కడ నిల్వ చేస్తారు. ఉదయం 11.30 గంటల సమయంలో దుకాణం వద్ద కాపర్ వైర్లను కాల్చి, కాపర్‌ను వేరుచేస్తున్న క్రమంలో మంటలు చెలరేగాయి. అవి సమీపంలోని రసాయన డ్రమ్ములకు వేగంగా వ్యాపించాయి. దీంతో అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలతో పాటు దట్టమైన పొగలు ఎగసిపడి లంకెలపాలెం ప్రాంతాన్ని కమ్ముకున్నాయి. మంటలు అంటుకున్న రసాయన డ్రమ్ముల నుంచి విష వాయువులతో కూడిన పొగ వెలువడటంతో స్థానిక ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సమాచారం అందిన వెంటనే పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాంకీ, అనకాపల్లి అగ్నిమాపక కేంద్రాల నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు.

మొదటి పేజీ తరువాయి....

## ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం

ఏపీ కీలకపాత్ర పోషిస్తోంది. ఆర్థికంగానే కాకుండా మేధోపరంగా, కార్యరూపకంగానూ ఈ ప్రయాణంలో భాగస్వాములుగా మాతో చేరండి' అని అన్నారు. జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ.. "అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో క్లీన్ ఎనర్జీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు మొబిలైజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ క్లీన్ ఎనర్జీ ఇన్ ఎమర్జింగ్ ఎకానమీస్ (ఎంఐసీఈఈ) కార్యక్రమం పెట్టుబడులను ఆవిష్కరించి, ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయడంలో మా సెంటర్ తోడ్పాటునందిస్తుంది. సైబర్ సెక్యూరిటీపై మా సెంటర్ ప్రత్యేకంగా దృష్టిసారిస్తుంది" అని పేర్కొన్నారు.

## ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి డ్రోన్లతో పహారా

చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. అధునాతన బారికేడ్లను చెక్‌పోస్టుల వద్ద అమర్చాలి. బేస్ క్యాంపులు, వాచ్ టవర్లతో గస్తీ ముమ్మరం చేయాలి. ఇంటి దొంగల్ని పట్టుకోవడానికి ప్రత్యేక ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేయాలి. శేషాచలం అడవుల్ని ఆనుకొని ఉన్న గ్రామాల్లో వన సంరక్షణ సమితి వాలంటీర్లతో సదస్సులు నిర్వహించాలి" అని పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

గో మాంసం రవాణా వెనుక ఎవరున్నా వదలద్దు

అమరావతి: విశాఖలో గో మాంసాన్ని నిల్వ చేసిన ముఠాల మూలాలు గుర్తించాలని, గో మాంసం నిల్వలు, రవాణా వెనుక ఎవరున్నా ఉపేక్షించవద్దని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఆయన విశాఖ పోలీసు కమిషనర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ మిత్రా కోల్డ్ స్టోరేజిలో నిల్వ ఉంచిన 1.89 లక్షల కేజీల గో మాంసాన్ని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకుని కేసును పోలీసు శాఖకు అప్పగించినట్లు కమిషనర్ తెలియజేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని వివరించారు.

# డిసెంబర్ 13న మెగా లోక్ అదాలత్



విశాఖపట్నం: జాతీయ లోక్ అదాలత్ ఆదేశాల మేరకు డిసెంబర్ 13న మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ చిన్నంశెట్టి రాజు తెలిపారు. జిల్లా కోర్టులో ఉమ్మడి విశాఖ జిల్లాలోని న్యాయమూర్తు లందరితో ఆయన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి, యలమంచిలి, చింతపల్లి, పాడేరు, అరకు, మాడుగుల, చోడవరం ప్రాంతాల్లోని అన్ని న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ జరుగుతుందని స్పష్టం చేశారు. రాజీ అయ్యే అవకాశమున్న అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్, బీమా, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన అన్ని కేసులను ఈ అదాలత్‌లో పరిశీలించి, పరిష్కరించాలన్నారు. మరిన్ని వివరాల కోసం తమను సంప్రదించాలని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు సూచించారు.

## జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు 'శ్రీకృష్ణాపురం' ప్రాజెక్టు ఎంపిక




విశాఖపట్నం: శ్రీకృష్ణాపురంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులం పూర్వ విద్యార్థి రూపొందించిన గణిత ప్రాజెక్టు జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికై ంది. గణిత ఉపాధ్యాయుడు సంపతిరావు సారథ్యంలో 10వ తరగతి పూర్వ విద్యార్థి(2024) పొన్నకాయల ఆకాష్ 'స్వచ్ఛ భారత్‌పై'ఈ గణిత శాస్త్ర ప్రాజెక్టును తయారు చేశాడు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే గతేడాది జరిగిన మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థి ఆకాష్, ఉపాధ్యాయుడు సంపతిరావు ఈ నెల 18 నుంచి 24 వరకు భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొనేందుకు బయలుదేరారు. ప్రస్తుతం ఆకాష్ విజయవాడ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి మాట్లాడుతూ రాష్ట్ర గురుకులాల చరిత్రలో 40 ఏళ్ల తర్వాత జాతీయ స్థాయి ప్రదర్శనకు ప్రాజెక్టు ఎంపికవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## సమాజహితమే అంబేడ్కర్ చైర్ల లక్ష్యం



విశాఖపట్నం: దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ చైర్లు సమాజ ఉపయుక్తంగా పనిచేయాలని అంబేద్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ వి.అప్పారావు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ చైర్లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి.. ఏయూలో నిర్వహించిన మొట్టమొదటి జాతీయ సదస్సు ముగింపు సమా వేశం జరిగింది. అంబేద్కర్ ఫౌండేషన్ సహకారంతో, ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చైర్, ఐఐఎంవీలోని అంబేద్కర్ చైర్ సంయుక్త సౌజన్యంతో 'డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం%–% న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధి' అనే అంశంపై రెండు రోజుల ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. అంబేద్కర్ చైర్లు సమాజంలో అనుబంధం కలిగి ఉండటం, సమాజ హితంగా పరిశోధనలు నిర్వహించడం అవసరమని స్పష్టం చేశారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమం అందించడం, వారి సాధికారతకు ప్రభుత్వ పథకాలు ఉపయోగపడేలా అంబేద్కర్ చైర్లు దృష్టి సారించాలన్నారు. అంబేద్కర్ ఫౌండేషన్ నూతన నియమావళిపై వారికి అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ సైన్సెస్ రంగాలలో పనిచేసేవారు ఏఐ టూల్స్‌ను వినియోగించడం ఎంతో అవసరమన్నారు. దీనిపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించాలని ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను కోరారు. ప్రతి సంవత్సరం ఇటువంటి సదస్సును నిర్వహించాలని, పరిశోధనల్లో నాణ్యతను పరిశీలిస్తామని, నాణ్యత విషయంలో రాజీపడరాదని చెప్పారు. అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ డా.తివారి, వీడీఎం%–% ఇండియా ఆన్ మూన్(ఎస్‌వో) చైర్మన్ ఆదర్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు. అతిథులను నిర్వాహకులు సత్కరించి, వారికి జ్ఞాపికలను ప్రదానం చేశారు.

## విశాఖ పోర్ట్‌లో నేపాల్, రష్యా బృందాల పర్యటన




విశాఖపట్నం: నేపాల్, రష్యాలకు చెందిన ఉన్నత స్థాయి వ్యాపార ప్రతినిధి బృందాలు విశాఖపట్నం పోర్ట్‌ను సందర్శించాయి. నేపాల్ ప్రతినిధి బృందానికి ఆ దేశ పరిశ్రమ, వాణిజ్య, సరఫరాల మంత్రి అనిల్ కుమార్ సిన్హా నాయకత్వం వహించారు. ఆయనతో పాటు నేపాల్ కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యం, సరఫరాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి బిపిన్ ఆచార్య, అండర్ సెక్రటరీ తరకరాజ్ భట్ట కూడా పాల్గొన్నారు. అలాగే, రష్యా నుంచి 11 మంది సభ్యులున్న వ్యాపార ప్రతినిధి బృందం కూడా పోర్ట్‌లో పర్యటించింది. ఈ అంతర్జాతీయ బృందాలకు పోర్ట్ అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్ట్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక సదుపాయాలు, సరకు రవాణా సామర్థ్యం, జరుగుతున్న ఆధునికీకరణ%–% యాంత్రీ కరణ పనులు, కవర్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సోలార్ పవర్ వినియోగం, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే ఎస్‌టీపీ ద్వారా నీటి రీసైక్లింగ్ వంటి విధానాలను వివరించారు. విశాఖ పోర్ట్ ద్వారా జరుగుతున్న దిగుమతి–ఎగుమతి కార్యకలా పాలు, వ్యాపార అభివృద్ధికి ఉన్న పెట్టుబడి అవకాశాలు, పరస్పర సహకార మార్గాలపై ఇరు వర్గాల ప్రతినిధులు చర్చలు జరిపారు.

## గాజువాకలో పద్మం సిల్వర్ జ్యుయలరీ ప్రారంభం



గాజువాక: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలలోని వివిధ ప్రాంతాల్లో తమ శాఖలను విజయవంతంగా నిర్వహిస్తున్న పద్మం సిల్వర్ జ్యుయలరీ సంస్థ.. ఇప్పుడు గాజువాకలో కూడా తన నూతన శాఖను ప్రారంభించింది. పాత గాజువాకలోని సీఎంఆర్ సెంట్రల్‌లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను సినీ నటి నిధి అగర్వాల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షోరూమ్‌లో సందడి చేశారు. స్టోర్‌లో ప్రదర్శించిన అన్ని రకాల ఆభరణాలను పరిశీలించి, అవి తనకు చాలా నచ్చాయని పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం సందర్భంగా స్టోర్ నిర్వాహకులు అద్భుతమైన ఆఫర్లను ప్రకటించారని తెలిపారు. లక్ష రూపాయల కొనుగోలుపై రూ.50 వేల విలువైన సిల్వర్ నగలను, రూ.50 వేల కొనుగోలుపై రూ.25 వేల విలువైన సిల్వర్ నగలను, రూ.25 వేల కొనుగోలుపై రూ.12,500 విలువైన సిల్వర్ నగలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. తనకు సిల్వర్‌లో టెంపుల్ జ్యుయలరీ అంటే ఎంతో ఇష్టమన్నారు. తాను కూడా కొనుగోలు చేశానని నిధి అగర్వాల్ వెల్లడించారు. సీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ మాట్లాడుతూ, సిల్వర్ జ్యుయలరీకి ప్రస్తుతం డిమాండ్ పెరిగిందన్నారు. పద్మం సిల్వర్ జ్యుయలరీలో సీజెడ్ జ్యుయలరీ, టెంపుల్ జ్యుయలరీ, యాంటిక్ జ్యుయలరీ, విక్టోరియా కలెక్షన్, కుందన్ కలెక్షన్, మోజో నైట్ కలెక్షన్ వంటి విభిన్న రకాల ఆభరణాలతోపాటు, అద్భుతమైన ఆఫర్లు అందుబాటులోకి ఉన్నట్లు పేర్కొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన రుసల్ ప్రతినిధి బృందం



నర్సీపట్నం: రష్యాకు చెందిన రుసల్ కంపెనీ ప్రతినిధి బృందం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించింది. విశాఖపట్నంలో జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఈ బృందం ఇక్కడ కళాశాలలో మైనింగ్ విభాగాన్ని పరిశీలించింది. విద్యార్థులకు కంపెనీలో ఉపాధి కల్పించడానికి ఆసక్తి కనబరిచింది. మూడు నెలల శిక్షణ అనంతరం మంచి వేతనంతో పాటు ఉచిత వసతి, భోజన వసతి సౌకర్యాలు తమ కంపెనీ కల్పిస్తుందని ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ, మైనింగ్ విభాగ అధిపతి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

**- చిన్నారులకు జేసీ శివ్‌నారాయణ్ శర్మ సూచన**

**- నగరవీధుల్లో ఉత్సాహంగా సాగిన ర్యాలీ**

అనంతపురం: బంగారు భవితకు బాటలు వేసే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సూచించారు. 58వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేడుకలను జేసీ ఆత్మీయ అతిథిగా విచ్చేసి ఆరంభించారు. పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ.. గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు కేంద్ర గ్రంథాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు గ్రంథాలయాల ప్రాధాన్యతను తెలిపేలా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సహాయ లైబ్రేరియన్ గోవిందు, డాక్టర్ రామలింగమయ్య, శ్రీరాములు, హరి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాకేంద్రంలోని మహిళా గ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీపతి ఆధ్వర్యంలో గ్రంథాలయా వారోత్సవాలు సందడిగా ఆరంభమయ్యాయి.

# మదనపల్లె కిడ్నీ రాకెట్ ముఠా అరెస్ట్

- నిందితుల్లో అన్నమయ్య జిల్లా డీసీహెచ్‌ఎస్ ఆంజనేయులు
- ఈ కేసుకు పలు రాష్ట్రాలతో లింకులు
- మదనపల్లె డీఎస్పీ మహేంద్ర వెల్లడి

మదనపల్లె: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర చెప్పారు. అరెస్టయిన వారిలో అన్నమయ్య జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) కె.ఆంజనేయులు ఉన్నారు. ఈ కేసు వివరాలను డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలెంకు చెందిన సాడి యమున (29) నుంచి ఈ నెల 9న మదనపల్లెలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కిడ్నీని తొలగించగా..ఆ మరుసటి రోజున ఆమె మృతి చెందింది. ఆమె తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి ఆరుగురిని అరెస్ట్ చేశామని, ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన వైద్యుడిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు.

మధ్యవర్తులతో మదనపల్లెకు.. సాడి యమున (29)కు ఆనందపురం మండలానికి చెందిన సూరిబాబు (45)తో సాన్నిహిత్యం ఉంది. యమునకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో కిడ్నీ ఇస్తే కష్టాలు తీరిపోతాయని సూరిబాబు చెప్పాడు. దీంతో మధ్యవర్తులైన విశాఖకు చెందిన కాకర్ల సత్య (43), పిల్లి పద్మ (45)తో ఈ విషయం చెప్రపడంతో వీరు సత్యసాయి జిల్లా కదిరి ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ మేనేజర్ మెహరాజ్ (37), మదనపల్లె ప్రభుత్వాసుపత్రి డయాలసిస్ మేనేజర్ బాలరంగడు(35) దృష్టికి తీసుకెళ్లారు. వీరు మదనపల్లెలోని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులను కలిసి కిడ్నీ ఇచ్చేవారు, స్వీకరించే వారున్నారని, పెద్ద మొత్తంలో నగదు వస్తుందని చెప్పగా..ఆయన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు నిర్ణయించారు. ఈ ఆపరేషన్ చేసేందుకు బెంగళూరుకు చెందిన డాక్టర్, అతని సహాయకులు ఇద్దరు పాల్గొన్నారని, డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈనెల 9న గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో యమునకు ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించగా యమున మృతి చెందిందని చెప్పారు. తాము



జరిపిన దర్యాప్తులో మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో యమునతోపాటు మరో మహిళ నుంచి కిడ్ని తొలగించి మరొకరికి అమర్చినట్లు డీఎస్పీ చెప్పారు. వీరిలో యమున మృతి చెందగా మరో మహిళ కోలుకుందని, యమున కిడ్నీ స్వీకరించిన వ్యక్తి కూడా ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. ఇంకా ఎంతమంది నుంచి కిడ్నీలు తొలగించారు, వాటిని ఎవరికి అమర్చారన్న వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్లు చేసిన బెంగళూరుకు చెందిన వైద్యుడిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఈ డాక్టర్ మదనపల్లెకు వచ్చి ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌లు చేస్తున్నట్లు చెప్పారు.

నాలుగు రాష్ట్రాల్లో లింకులు... మదనపల్లె కిడ్నీరాకెట్ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు డీఎస్పీ చెప్పారు. కిడ్నీలు స్వీకరించిన వారి నుంచి అందిన మొత్తంలో అందరూ కలిసి వాటాలు వేసుకున్నారని తెలిపారు. ఈ కేసు లింకులు కర్ణాటక, గోవా, తెలంగాణ, ఏపీల్లో ఉన్నాయని, దీనిపై 4 పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కిడ్నీ రాకెట్ కేసులో మరో ఎనిమిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ చెప్పారు. అరెస్ట్ చేసిన ఆరుగురు నిందితుల ఫోన్లను, సీసీ కెమెరా సీడీఆర్‌లను స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు పంపినట్లు చెప్పారు.

# గంజాయి.. డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

- **23.5 కిలోల గంజాయి.. 1,620 డ్రగ్స్ మాత్రల స్వాధీనం**

కడప: యువతకు గంజాయి, డ్రగ్స్ మాత్రలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముఠాను కడప పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.15 లక్షలు విలువ చేసే 23.5 కిలోల గంజాయి రూ.96 వేలు విలువ చేసే 1620 డ్రగ్స్ (మత్తు) మాత్రలు జప్తు చేశారు. వీరందరికీ గ్యాంగ్ లీడర్ అయిన కడప చిన్నచౌకుకు చెందిన రౌడీషీటర్ సురభి మహేష్ కూడా ఉన్నారు. అరెస్టైన వారిని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ సమావేశ మందిరంలో మీడియా ఎదుట హాజరుపరిచారు. కడప చిన్నచౌకుకు చెందిన సురభి మహేష్‌పై జిల్లాలో పలు కేసులున్నాయి. అతనిపై చిన్నచౌకు ఠాణాలో రౌడీషీట్ కూడా ఉంది. ఇటీవల సురభి మహేష్ అరెస్టైన కడప జైలుకు వెళ్లాడు. జైల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్ అనే వ్యక్తితో పరిచయమైంది. ఒడిశా నుంచి గంజాయి ఎలా సరఫరా చేయాలో అతని నుంచి తెలుసుకున్నాడు. ఈ నేపథ్యంలో సురభి మహేష్ బయటికి వచ్చాక కడప నిరంజన్ నగర్‌కు చెందిన కాకాని శివకుమార్, సీకే దిన్నె మండలం, మద్దిమడుగుకు చెందిన షేక్ రహంతుల్లా, నర్సరామయ్యగారిపల్లెకు చెందిన సోము శివ ప్రశాంత్, చిన్నచౌకుకు చెందిన షేక్ అబ్దుల్ రజాక్, ఎర్రముక్కపల్లెకు చెందిన పులివీర మణికంఠ, తిలక్‌నగర్‌కు చెందిన షేక్ అల్తాఫ్, అన్నమయ్య కూడలికి చెందిన పఠాన్ మన్సూర్‌ఖాన్, కర్నూలు నగరం, సీతారామనగర్‌కు చెందిన సన్నితి నాగేంద్రలను కలుపుకొని వారికి డబ్బులు ఆశ చూపించి, విలాసవంతమైన జీవితం గడిపేందుకు వారితో గంజాయి, డ్రగ్స్ (మత్తు మాత్రల) వ్యాపారం ప్రారంభించారు. కర్నూలుకు చెందిన మందుల దుకాణ యజమాని నాగేంద్రతో చేతులు కలిపి తక్కువ ధర ఉన్న డ్రగ్స్ (మాత్రలను) ప్యాకెట్ రూ.350 ఉంటే రూ.5 వేలకు విక్రయించాడు. ఒడిశా నుంచి గంజాయి రవాణా చేసి నగరంలో



పలు ప్రాంతాల్లో ప్యాకెట్ల రూపంలో విక్రయించేవారు.

పక్కా సమాచారంతో దాడి... కడప రిమ్స్ ఠాణా పరిధిలో గంజాయి విక్రయాలు ఎక్కువగా ఉన్నాయని పోలీసులకు తెలియడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై సుభాష్‌చంద్రబోస్‌తో పాటు వారి సిబ్బంది నిఘా ఉంచారు. ఈ మేరకు కడప శివారులోని డీటీసీ వద్ద గంజాయి, మత్తు మాత్రలు విక్రయిస్తున్న సురభి మహేష్‌తో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.15 లక్షలు విలువ చేసే 23.5 కిలోల గంజాయి, రూ.96 వేలు విలువ చేసే 1,620 మత్తు మాత్రలను స్వాధీనపరచుకున్నారు.

సురభి మహేష్‌పై పలు కేసులు... ఈ కేసులో ప్రధాన నిందితుడైన సురభి మహేష్‌పై పులివెందులలో హత్య కేసు, ప్రొద్దుటూరులో రెండు కార్ల దొంగతనం కేసులు, కిడ్నాప్ కేసులు, తిరుపతిలో దోపిడీ కేసు, చాపాడులో హత్యాయత్నం కేసు, పెండ్లిమర్రిలో దొంగతనం, సిద్దవటంలో లారీ చోరీ కేసు, జమ్మలమడుగులో మరో చోరీ కేసు, కడప నగరంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో కూడా అతనిపై పలు కేసులున్నాయి. వీరి ఆస్తులను కూడా జప్తు చేస్తామని ఎస్పీ చెప్పారు. మత్తు మందులను ఉపయోగించేవారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించామన్నారు.



# పరిశుభ్రమైనసమాజాన్ని నిర్మిద్దాం

పుట్టపర్తి: పరిశుభ్రమైన సమా జం నిర్మాణం కోసం ప్రతిపౌరుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసర ముం దని కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మం డలపరిధిలోని జగరాజుపల్లి కేజీబీవీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, పాఠశాలలో చేపడుతున్న పరిశుభ్రత చర్యల గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల హాస్టళ్లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా అలవరచుకోవాలని తెలియ జేశారు. చేతుల పరిశుభ్రతపై డెమో నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్ర తలో చేతుల పరిశుభ్రత అత్యంత ముఖ్యమని సూచించారు. అనంతరం వ్యక్తిగత పరిశు భ్రతపై చేసిన ప్రతిజ్ఞలో విద్యార్థినులతో పాటు పాల్గొన్నా రు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, డీఈఓ కిష్టప్ప, ఎంఈఓ, కేజీవీబీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించండి

**- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ**

హిందూపురం: ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరవేస్తూ అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణ సూచించారు. ఎమ్మెల్యే కొడికొండ సమీపంలోని హిల్స్‌గెస్ట్ హౌస్‌లో చిలమత్తూరు మండలానికి చెందిన అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ పరంగా వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గ్రామాల్లో విద్యుత్తు కోతలు లేకుండా చూడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎంత భూమి సేకరిస్తున్నారు. వారికి ఏమేరకు పరిష్కారం అందించారని ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా గ్రామ సచివాలయం, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో



ఎమ్మెల్యే కార్యదర్శి వీరయ్య, మండలంలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం

రాయదుర్గం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఇప్పటి నుంచే ఆ బాధ్యతను ప్రతి ఒక్కరూ భుజస్కంధాలపై వేసుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మద్దానేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన కన్వీనర్ల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని శాంతినగర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుం చి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీశ్రేణులు, నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ.. మద్దానేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరారు. ఈ సందర్భంగా కణేకల్లు మండల కన్వీనర్‌గా వన్నారెడ్డి, రాయదుర్గం పట్టణ కన్వీనర్‌గా బండి క్రిష్ణమూర్తి, డీ.హీరేహాళ్ మండల కన్వీనర్‌గా కాదలూరు మోహనరెడ్డి, గుమ్మఘట్ట కన్వీనర్‌గా కాలవ సన్నన్నలతో పాటు క్లస్టర్ ఇనఛార్జులు, బూత కన్వీనర్లతో విప్ ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. విప్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రాకుండా కలిసికట్టుగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో యువనాయకు డు కాలవ భరత, మార్కెట్‌యార్డ్ ఛైర్మెన హనుమంతరెడ్డి, కార్పొరేషన డైరెక్టర్లు పొరాళు పురుషోత్తం, నాగల్లి రాజు, ఆనంద్‌రాజ్, నాయకులు గిరిమల్లప్ప, పసుపులేటి నాగరాజు, బలరాంరెడ్డి, కురుబ హనుమంతు, లాలెప్ప పాల్గొన్నారు.

# పక్కాగా భోజన పథకం అమలు

కందుకూరు: మధ్యాహ్న భోజనం పథకాన్ని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు సూచించారు. గుడ్లూరు మండలంలోని పోట్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, గుడ్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కందుకూరు మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కందుకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. కోడిగుడ్లు, స్టాక్ వివరాలను ఆరాతీశారు. పలు రికార్డులను తనిఖీ చేసి సూచనలిచ్చారు. జెడ్పీ స్కూల్లో భోజనం రుచి చూశారు. బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహార విషయంలో అశ్రద్ధగా ఉన్నా, నాణ్యతా ప్రమాణాలు పాటించక పోయినా ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. చౌక దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం, చక్కెరను సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ లీలారాణి, డీఎం అర్జున్‌రావు, సమన్వయ అధికారి సైమన్ బాబు, కందుకూరు విద్యాశాఖాధికారులు కుమారశర్మ, కె.సుబ్బారెడ్డి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# అనుమానంతో అంతమొందించాడు

పులివెందుల: పులివెందుల మండలం చిన్నరంగాపురంలో జరిగిన హత్య కేసును పులివెందుల పోలీసులు ఛేదించారని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన వంశీకృష్ణ (30) స్థానిక మహిళతో తరచూ



మాట్లాడుతూ ఉండటాన్ని ఆమె భర్త రాఘవేంద్ర గమనించారు. వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుందేమోనని అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పాఠశాల వద్ద చరవాణి చూసుకుంటున్న వంశీకృష్ణపై ఒక్కసారిగా కొడవలితో తీవ్రంగా దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు గుర్తించి వంశీకృష్ణను కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. అతని సోదరుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో పైన పేర్కొన్న విషయాలు వెలుగు చూశాయి. ముద్దనూరు రోడ్డులో నిందితుడు సంచరిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

# కూటమి పాలనతోనే మైనార్టీల అభివృద్ధి

ధర్మవరం: ముస్లిం మైనార్టీలకు మంచి చేసింది, చేసేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ నియోజక వర్గ ఇనచార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజనలకు వేత నాలు చెల్లించడంతో ఆయన అనంతపు రంలోని క్యాంపు కార్యాలయంలో ధర్మవరం ముస్లింలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు చిత్రపటానికి క్షీరాభి



షేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షు డు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి, చట్టా లక్ష్మీనారాయణ, గవ్వల నారాయణస్వామి, ముస్లిం నాయకులు నాగూర్‌హుస్సేన, రాళ్లపల్లి షరీఫ్, రాళ్లపల్లి బాబు, అస్లాం, రావుల చెరువు కుళ్లాయప్ప, షామీర్, ఆజాద్, మాబు పాల్గొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలను దూదేకులకు అందే లా చూడాలని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర కార్పొ రేషన డైరెక్టర్ రాళ్లపల్లి షరీఫ్‌కు టీడీపీ నియోజకవర్గ ఇనచార్జ్ పరిటాల శ్రీ రామ్ సూచిం చారు. నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర కార్పొరేషన డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ధర్మవరానికి చెందిన రాళ్లపల్లి షరీఫ్ ముస్లింలతో కలిసి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. దూదేకుల్లో చాలా మంది పేదలున్నారని, అలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూడాలని రాళ్లపల్లి షరీఫ్‌కు శ్రీరామ్ సూచించారు. దూదేకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషిస్తానని షరీఫ్ తెలియజేశారు.

# క్షేత్రస్థాయిలో పనిచేయకనే ఓటమి

### - మోసం చేయడం హరీశ్‌రావు నైజం - కేటీఆర్ సోషల్ మీడియా వీడి బయటకు రావాలి - తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



మెదక్: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ మంచి మెజార్టీతో గెలిచిందని, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి అనుకున్న స్థాయిలో పనిచేయడం లేదని దీంతో అర్థమవుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా మెదక్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'కృష్ణార్జునులు అని చెప్పుకొంటున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకొని, ఒకరి జబ్బ ఒకరు చరుచుకోవడం తప్పితే, క్షేత్రస్థాయిలో పని చేయలేదని అర్థమైంది. ఉప ఎన్నికలో పోటీ చేసిన 15 మంది స్వతంత్ర అభ్యర్థులు నా వద్దకు వచ్చి.. నామినేషన్ ఉపసంహరించుకుంటాం.. ఎవరికి మద్దతు ఇవ్వాలని అడిగితే.. నాకు ఈ ఎన్నికతో సంబంధం లేదు. మీరు ఎవరి దగ్గరికైనా వెళ్లండని చెప్పా. వారు హరీశ్‌రావును కలిస్తే ఆయన కూడా ఎవరికైనా మద్దతు ఇవ్వండని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఇది భారత రాష్ట్ర సమితిని మోసం చేసినట్లే. అది ఆయన నైజం. ఫలానా అభ్యర్థిని బరిలో నిలుపుతాం.. మీకు మద్దతు ఇస్తామని కాంగ్రెస్‌కు సమాచారం చేరవేస్తే ఆ పార్టీ నాయకులు వద్దనడంతో హరీశ్‌రావు సైలెంట్ అయ్యారు. గత ప్రభుత్వంలో పని చేసిన పెద్ద నాయకుల ఫామ్‌హౌస్‌లు, పొలాలను రక్షించేందుకే రీజినల్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ మార్చారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో 56 మందికి చెందిన 59 ఎకరాలు ట్రిపుల్ ఆర్ కోసం సేకరిస్తే హరీశ్‌రావుకు చెందిన ఓ రిసార్ట్ ఉందని, చిన్నచింతకుంట వద్ద మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు చెందిన 15 ఎకరాలు, ఎమ్మెల్సీ నవీన్‌రావుకు చెందిన 18 ఎకరాలు ఉన్నాయని జనంబాటలో రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. అందుకే ఎలైన్‌మెంట్‌ను మార్చారని వారు చెప్పారు.

హరీశ్‌రావు, రేవంత్‌రెడ్డి మధ్య అవగాహన... కేటీఆర్ సోషల్ మీడియా విడిచి క్షేత్రస్థాయిలోకి రావాలి. హరీశ్‌రావు మోసం చేయడం బంద్ చేయాలి. వారిద్దరూ కేసీఆర్ కళ్లకు గంతలు కట్టి, అరాచకాలు చేస్తున్న నాయకులను కాపాడుతున్నారు. భారత రాష్ట్ర సమితికి చెందిన జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మదన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి గతంలో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎలా ఉన్నారు? నాకు 2014 ముందు ఉన్న ఆస్తులే.. ఇప్పుడూ ఉన్నాయి. ఎస్టీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లకు టెండర్లు వేయకుండానే హరీశ్‌రావు సతీమణికి చెందిన పాల కంపెనీ నుంచి ఎలా పాలు సరఫరా చేస్తున్నారు? హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఉన్న అవగాహన ఏమిటో చెప్పాలి. కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారు. సార్ బయటకు వస్తే సీన్ వేరే రకంగా ఉంటుంది' అని కవిత చెప్పారు.

# 2030 నాటికి ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

### - ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు



రాయదుర్గం: తెలంగాణను 2030 నాటికి దేశ ఏరో ఇంజిన్ రాజధానిగా అభివృద్ధి పరచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకో సిస్టమ్(వైమానిక- అంతరిక్ష, రక్షణ రంగ సంబంధిత వ్యవస్థ)ను అభివృద్ధి పరిచేందుకు సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) ఖెంకా ఆడిటోరియంలో కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌బీ ముంజాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సమిట్'ను నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించి మాట్లాడారు. 'రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లు కాగా.. 2024-25లో రూ.30,742 కోట్లకు చేరుకుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. పరిశ్రమకు అవసరమైన విధంగా మానవ వనరులను సిద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలు సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పాటవగా మరిన్ని దిగ్గజ సంస్థలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి' అని వివరించారు. హీరో ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్ మాట్లాడుతూ ఏరోస్పేస్‌లో భారత్ అద్భుత పురోగతిని సాధిస్తోందని, విదేశాలకు చెందిన కృత్రిమ ఉపగ్రహాలను వినువీధుల్లోకి ప్రవేశపెడుతుండడం శుభపరిణామమన్నారు. డీఆర్‌డీఓ బ్రహ్మోస్ డీజీ, బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ సీఈఓ, ఎండీ డా.జైతీర్థ్ ఆర్ జోషి, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ డిప్యూటీ చీఫ్, వైస్ అడ్మిరల్ వినీత్ మెక్ కార్టీ, బీఈఎల్ సీఎండీ మనోజ్ జైన్, బోయింగ్ ఇండియా సౌత్ ఏసియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే, ఐఎస్‌బీ డీన్ ప్రొ.మదన్ పిల్లుట్ల, ఐఎస్‌బీ ఎంజీఐఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

### - పార్టీ గుర్తును అవమానించడం హేయమైన చర్య - కాంగ్రెస్‌పై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారికి ఏ ఆపద వచ్చినా అర గంటలో వారి ఇంటి ముందు ఉంటానని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టంచేశారు. దాడిలో గాయపడిన రహ్మత్‌నగర్ డివిజన్ భారత రాష్ట్ర సమితి కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్‌ను వారి ఇంట్లో పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. "ఫలితాలు వెలువడి 24 గంటలు గడవకముందే మా కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకుల దాడులు మొదలయ్యాయి. ఇది ఆందోళనకరం. మా పదేళ్ల పాలనలో ఇలాంటి దాడులకు పాల్పడి ఉంటే మీ పరిస్థితి ఎలా ఉండేది? దాడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి. మా గుర్తు కారును అవమానించేలా ప్రవర్తించడం హేయమైన చర్య.

మేం అనేక ఎన్నికల్లో గెలిచాం. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు సైతం రాలేదు. అలాగని వారి గుర్తును మేం ఎప్పుడూ అవమానించలేదు. మాకు సాధారణ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 80 వేల ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 5 వేల ఓట్లు మాత్రమే తగ్గాయి. ఓటర్లకు తాయిలాలిచ్చి, డబ్బులు, చీరలు పంచి, రిగ్గింగ్ చేసి సాంకేతికంగా మాత్రమే వారు గెలుపొందారు. జూబ్లీహిల్స్‌లో మళ్లీ ఎగిరేది గులాబీ జెండాయే. ఎన్నికలో వారు ఏం చేసి గెలిచారో రాష్ట్ర ప్రజలంతా గమనించారు. ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర వహించింది" అని కేటీఆర్ ఆరోపించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, జూబ్లీహిల్స్‌లో భారత రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసిన మాగంటి సునీత, కార్పొరేటర్లు ఉన్నారు.

సునీత కుటుంబానికి ధైర్యం చెప్పిన కేటీఆర్

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని.. ధైర్యంగా ఉండాలని మాగంటి సునీతకు కేటీఆర్ సూచించారు. శనివారం మాదాపూర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రచారంలో సునీతతోపాటు వారి పిల్లలు చూపిన పోరాట స్ఫూర్తిని అభినందించారు.

# బీసీలకు ద్రోహం చేస్తోంది ఆ మూడు పార్టీలే

### - కామారెడ్డి బీసీ ఆక్రోశ సభలో జస్టిస్ వి.ఈశ్వరయ్య



కామారెడ్డి: భాజపా, భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్..ఈ మూడు పార్టీలు బీసీలకు ద్రోహం చేస్తున్నాయని 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య ఆరోపించారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీసీ ఆక్రోశ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టకుండా భాజపా అడ్డుకుంటోందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలను నిర్లక్ష్యం చేసిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక నాటకాలాడుతున్నారని విమర్శించారు. తమిళనాడులో అమలు చేస్తున్న రిజర్వేషన్ల తరహాలో ఇక్కడ కూడా అమలు చేస్తామని గతంలో నాయకులు చెప్పారని, ప్రస్తుతం దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కల్పించిన కేంద్ర సర్కారు బీసీలపై నిర్లక్ష్యం వహిస్తోందని, కేంద్ర పథకాల అమలు అధ్వానంగా ఉందని విమర్శించారు. సమష్టి పోరాటాలతోనే రిజర్వేషన్లు సాధించుకుందామని సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని వైస్‌ఛైర్మన్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల సాధనకు బీసీల చేత ప్రతినిధులు ప్రతిజ్ఞ చేయించారు.

# ఇదే ఉత్సాహంతో పని చేయండి

### - భవిష్యత్తులో అన్ని ఎన్నికల్లోనూ గెలవాలని రాష్ట్ర నాయకత్వానికి రాహుల్, ఖర్గే మార్గనిర్దేశం



దిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను, ఆయన విజయానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కృషి చేసిన పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే అభినందించారు. నవీన్ కుమార్‌ను వెంటబెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు... లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీవేణుగోపాల్‌లను కలిశారు. వారికి పార్టీ అభ్యర్థి సాధించిన ఘనవిజయం, అందుకోసం నాయకులు, శ్రేణులు శ్రమించిన తీరును వివరించారు. ఈ సందర్భంగా అగ్రనేతలంతా ముమ్ముందు రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఇదే తరహా విజయాన్ని సొంతం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు.

అనంతరం విలేకర్లతో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... "జూబ్లీహిల్స్‌లో వచ్చిన తీర్పు రాష్ట్రంలో రెండేళ్లుగా సాగుతున్న ప్రజాపాలనపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్న సందేశాన్ని ఇచ్చింది. ఇదే ఉత్సాహంతో రాబోయే జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు వచ్చే మంత్రిమండలి సమావేశంలో చర్చించి... నిర్ణయం తీసుకుంటారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఇప్పటికీ కట్టుబడి ఉంది. ఈ అంశంపై కాంగ్రెస్‌కున్న నిబద్ధత ఇతర ఏ పార్టీలకూ లేదు. రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలను, భాజపా సృష్టించిన అడ్డంకులను ప్రజలంతా గమనించారు" అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ డబ్బు వెదజల్లి గెలించిందన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణలను తోసిపుచ్చారు. డిపాజిట్లు కోల్పోయిన పార్టీ నేతల వ్యాఖ్యలకు విలువ లేదని వ్యంగ్యంగా అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రజాసేవ చేసుకోవడానికి అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుకొనేందుకు తాను దిల్లీ వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు తనను భారీ మెజార్టీతో ఆశీర్వదించడంపట్ల పార్టీ పెద్దలు సంతోషం వ్యక్తంచేశారన్నారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్తలపై కాంగ్రెస్ వారు దాడి చేశారన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు.

# ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులపై విన్‌గ్రూప్ ఆసక్తి


### - సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ఆసియా సీఈవో భేటీ - రాష్ట్రంలో ఈవీ, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో పెట్టుబడులపైనా చర్చ



దిల్లీ: వియత్నాం దేశానికి చెందిన విన్‌గ్రూప్ ఏసియా సీఈవో ఫామ్ సాన్ చౌ దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టే అంశంపై చర్చించారు. తెలంగాణలో ఎలక్ట్రానిక్ వాహనా(ఈవీ)ల తయారీ యూనిట్లు, బ్యాటరీ స్టోరేజీ సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై ఆసక్తి వ్యక్తపరిచారు. రాష్ట్రంలో సుస్థిర, శుద్ధ ఇంధన ఉత్పత్తిని పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటుచేసే అంశంపైనా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్‌సిటీ పైనా ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. దాని అభివృద్ధిలో తమ గ్రూప్ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులపై వారు ఆసక్తి వ్యక్తం చేయడాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. డిసెంబరు 8-9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఫామ్ సాన్ చౌతోపాటు ఆ గ్రూప్ సంస్థ ఛైర్మన్ ఫామ్ నాట్ వుయాంగ్‌లనూ ఆహ్వానించారు. ఈ భేటీలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కూడా ఉన్నారు. భవిష్యత్తులో చేపట్టే వివిధ ప్రాజెక్టులు, హరిత ఇంధన రంగాల్లో ప్రపంచస్థాయి పెట్టుబడుల భాగస్వామ్యాలను బలోపేతం చేయడంలో ఈ సమావేశం ఒక కీలక ముందడుగని రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది.

# ఏటీసీలతో 2 లక్షల మందికి ఉపాధి నైపుణ్యాలు

### - మంత్రి వివేక్



హైదరాబాద్: రాష్ట్రంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రా(ఏటీసీ)ల ద్వారా 2 లక్షల మంది తెలంగాణ యువతను ఉపాధి, ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దుతామని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఏటీసీల్లో దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెట్టాలని, పారిశ్రామిక అవసరాలకనుగుణంగా మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఏటీసీ ప్రిన్సిపాళ్లకు ఉపాధికల్పనశాఖ ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. "ఐటీఐలను ఏటీసీలుగా ఆధునికీకరించడంతో భవిష్యత్తులో మెరుగైన ఫలితాలు వస్తాయి. యువత ఉపాధి సవాళ్లను అధిగమించొచ్చు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా నిపుణులైన ఆధునిక కార్మిక బలగాన్ని సిద్ధం చేయాలి. తెలంగాణలో ఏటీసీల విజయంతో టాటా సంస్థ మరిన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఏటీసీల్లో విద్యార్థుల హాజరుపై దృష్టిపెట్టాలి. డ్రాపౌట్లు లేకుండా చూడాలి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, ఉపాధికల్పన శాఖ సంయుక్త సంచాలకులు ఎస్‌వీకే నగేశ్, టాటా గ్రూపు ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ సృష్టిస్తాం

### - మహిళా సమాఖ్యల రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి సీతక్క



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళా శక్తి కీలక పాత్ర పోషిస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామనే లక్ష్యం సాకారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని, మాదాపూర్ శిల్పారామం తరహాలో హైదరాబాద్‌లో మరిన్ని మహిళాశక్తి బజార్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రజాభవన్‌లో మండల సమాఖ్య నూతన అధ్యక్షురాళ్ల రాష్ట్రస్థాయి సదస్సులో ఆమె ప్రసంగించారు.

"రాష్ట్రంలో కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే అనేక సమాఖ్యల్లో రూ.కోట్ల నిధులు ఉండడంతో లక్ష్యం దిశగా పయనిస్తున్నాయి. ఇందిరాగాంధీ జయంతి అయిన నవంబరు 19న మహిళాశక్తి బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు చేపడతాం. మహిళా సంఘాలు ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత ముందుకెళ్లాలి. ఆర్థికంగా నిలదొక్కుకోని మహిళలను ప్రోత్సహించాలి. రుణాల స్వీకరణ, వ్యాపారాల నిర్వహణలో సాయం చేయాలి. అన్యాయాలకు గురైన వారికి అండగా ఉండాలి. గ్రామం, బడి, అంగన్‌వాడీ, పీహెచ్‌సీల నిర్వహణలో మహిళా సమాఖ్యలు క్రియాశీలకంగా వ్యవహరించాలి" అని సీతక్క సూచించారు. సమావేశంలో మహిళా కమిషన్, ఆర్థిక సంస్థల ఛైర్‌పర్సన్లు నేరెళ్ల శారద, శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సత్యసాయి సన్నిధిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం సీజేఐ దంపతులను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సన్మానించారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో తిరుపతి నుంచి పుట్టపర్తి చేరుకున్న సీజేఐకి.. అనంతపురం జిల్లా జడ్జి భీమారావు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీష్‌కుమార్ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరారు.

# గోమాత బతికితేనే దేశం బాగుంటుంది


**- గోసేవను తల్లిదండ్రుల సేవగా చూడాలి - జగద్గురు పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహరాజ్ - తిరుపతిలో కొనసాగుతున్న 13వ పంచగవ్య వైద్య మహాసమ్మేళనం**



తిరుపతి: 'భారత సనాతన ధర్మంలో భాగమైన గోమాత బతికితేనే దేశం బాగుంటుందన్న విషయాన్ని పాలకులు గుర్తుపెట్టుకోవాలని జగద్గురు పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహరాజ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులను ఏ విధంగా చూసుకుంటున్నామో.. గోమాతలను సైతం అలాగే చూడాలని సూచించారు. పంచగవ్య విద్యాపీఠం, పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 13వ జాతీయ పంచగవ్య వైద్య మహాసమ్మేళనానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'గోవు మన జీవన విధానమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పంచగవ్య విద్యాపీఠంలో పీజీ, డాక్టరేట్లు చేస్తున్న వారందరూ గోసంరక్షణకు కృషి చేయాలి. గోమాత సేవతో, తద్వారా లభించే శక్తితో యావత్ భారత జాతికి మేలు జరుగుతుందనే విషయాన్ని చాటిచెప్పాలి. శ్రీకృష్ణ భగవానుడు గోసేవ చేసి ప్రపంచానికి గోవుల ప్రాధాన్యాన్ని తెలియజేశారు' అని పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహరాజ్ వివరించారు. ఈ సదస్సుకు అఖిల భారత గోసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణగురుస్వామి, జాతీయ సమ్మేళనం సంయుక్త కార్యదర్శి గొంది ఝాన్సీలక్ష్మి, పంచగవ్య విద్యాపీఠం వీసీ కపిల్ కుమార్, గురుకులపతి గవ్యసిద్ధాచార్య నిరంజన్ వర్మ, జాతీయ సాంస్కృతిక యూనివర్సిటీ ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, హైదరాబాద్ ప్రకృతి వైద్య నిపుణులు మురళీధరరావు, తదితరులు హాజరయ్యారు.

# హిందూపురం వైసిపి కార్యాలయంపై దాడి

**- ఫర్నీచర్ ధ్వంసం చేసిన టిడిపి శ్రేణులు**



హిందూపురం: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోతీవ్ర ఉద్రిక్తత నెలకొంది. లేపాక్షి మండలంలో శనివారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వేణురెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికుడు కాదని, హిందూపురం అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శలు చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హిందూపురంలోని వైసిపి కార్యాలయంపై మూకుమ్మడి దాడికి పాల్పడ్డాయి. ఫర్నీచర్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశాయి. వైసిపి నాయకులు కార్యాలయం వద్దకు చేరుకుని ఖండించారు. అక్కడి నుంచి వన్‌టౌన్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి, దాడి చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, వేణు రెడ్డి ఇతర నాయకులు సిఐకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు అంబేద్కర్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వేణురెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరు పార్టీల వారు ఆందోళనలకు దిగడంతో పోలీసులు సర్దిచెప్పి ఆందోళనలను విరమింపజేశారు.

# సతీష్‌కుమార్ మరణం ముమ్మాటికీ హత్యే

**- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య**




అమరావతి: పరకామణి కేసు ఫిర్యాదారుడు సతీష్‌కుమార్ మరణంపై అనుమానాలున్నాయని, ఇది ముమ్మాటికీ హత్యే అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరకామణి దొంగతనం కేసు దర్యాప్తును ఎలా నీరుగార్చారు, రాజీ చేసిన అంశాలను ప్రస్తావించడం లేదన్నారు. 'పోలీసుల వేధింపులు సహించలేక బలవన్మరణం చేసుకున్నారు' అని సతీష్ మరణించిన వెంటనే వైసిపి అధికార ట్విట్టర్‌లో పోస్టు చేయడంపై రామయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఇదే విధంగా మాట్లాడటం గుమ్మడికాయ దొంగలు భుజాలు తడుముకున్నట్లుగా ఉందని విమర్శించారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసిపి ట్వీట్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అధికారులు సిఐలు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డి ప్రాణాలకు ముప్పు ఉందని అనంతపురం ఎస్పి జగదీష్.. డిజిపికి లేఖ రాయాలన్నారు. దొంగతనం కేసులో ముద్దాయిగా ఉన్న రవికుమార్ ప్రాణాలకు కూడా తీవ్రమైన ముప్పు ఉందని, ధర్మారెడ్డి ప్రాణాలను కూడా పోలీసులు కాపాడాలని కోరారు. సతీష్‌కుమార్ హత్యతో వైసిపికి ఉలికిపాటు ఎందుకని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయకుమార్ ప్రశ్నించారు. సతీష్ మృతదేహానికి పోస్టుమార్టం కూడా పూర్తికాకుండానే హత్యను ఆత్మహత్యగా టిటిడి మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి ఉపన్యాసం ఇచ్చేశారని తెలిపారు.

# దేశంలోనే బెస్ట్‌గా శ్రీసిటీ




విశాఖపట్నం: ప్రఖ్యాత పారిశ్రామిక వాడ శ్రీసిటీకి మరిన్ని మెరుగులు దిద్ది, దేశంలోనే బెస్ట్గా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా పలు కీలక రంగాల్లో పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్), రేమాండ్, శ్రీసిటీల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. శ్రీసిటీకి సంబంధించిన ఐదు యూనిట్లను చంద్రబాబు వర్చువల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసిటికి సంబంధించిన మరో 12 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులపై సంతకాలు జరిగాయి. ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తులకు సంబంధించి రూ.2,320 కోట్లతో ఈ నిర్మాణాలు జరుగుతాయి. దీనివల్ల 12,365 మందికి ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ శ్రీసిటీ అన్నది దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక కారిడార్గా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 30 వరకు పరిశ్రమలు ఉన్నాయని, త్వరలోనే 50 పరిశ్రమల స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రీసిటీ అభివృద్ధికి త్వరలోనే ఆరు వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించారు. శ్రీసిటీలో 50 దేశాలకు చెందిన సంస్థల ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సంస్థల రవాణా అవసరాల కోసం ఒక ఎయిర్‌స్ట్రిప్ కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే బెల్జియం, జపాన్, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హెల్త్‌కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, వైద్య పరికరాలవంటి వాటికి 8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటవుతున్న సంస్థల్లో వచ్చే ఒక సంస్థ ఉత్పత్తులు ఇంకో సంస్థకు ముడిసరుకుగా మారుతాయని, దీనివల్ల ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. 2028 నాటికి శ్రీసిటీని అత్యుత్తమ పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎమి రవి సానారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో మరింతగా అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వీలయినన్ని ఎక్కువ సంస్థలు ఇక్కడకు వచ్చేలా చూస్తామని హామీనిచ్చారు.

# కర్నూలు ప్రమాదం నుంచి పాఠాలు

**- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**



విశాఖపట్నం: ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి పాఠాలు నేర్చుకొని.. ప్రమాదాలు లేని రాష్ట్రంగా ఏపీని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఆర్టీవో కార్యాలయాన్ని సందర్శించి, రూ.16 కోట్లతో నిర్మాణంలో ఉన్న ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, వెహికల్ ఫిట్నెస్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమా దాలకు ప్రధాన కారణం అతివేగమేనని, ముఖ్యంగా 18 నుంచి 40 ఏళ్ల వారు నడిపే వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయని గుర్తించామన్నారు. అలాగే ద్వారకా బస్టేషన్ కాంప్లెక్సున్ను సందర్శించి ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడి స్త్రీ శక్తి పథకం, బస్సుల సమయాలు, తాగునీటి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అద్దె దుకాణాలను తనిఖీ చేసి, ఎంఆర్పీకి మాత్రమే వస్తువులు, శీతల పానీయాలు విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. డాక్టర్ సంతోష్ అందించిన 1620 ప్రథమ చికిత్స కిట్ బాక్సును విజయనగరం జోన్లోని అన్ని బస్సులకు అందజేయనున్నట్టు మంత్రి ప్రకటించారు. 627 మంది అర్హులైన వారికి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రూ.100 చార్జీతో కొనుగోలు చేసే 'ట్రావెల్ యాజ్ యు చైన్ టికెటు 24 గంటల వ్యవధితో సిటీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతిస్తూ తగు ఆదేశాలు జారీ చేశారు. జోన్-1 ఈడీ కె. బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

# బ్రాండిక్స్‌తో నిజమైన మహిళా సాధికారత

**- ప్రపంచస్థాయి వస్త్రాల తయారీపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రశంస**



అచ్యుతాపురం: బ్రాండిక్స్ ద్వారా నిజమైన మహిళా సాధికారత సాధించారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లోని బ్రాండిక్స్ అపెరల్ సిటీని ఆయన సందర్శించారు. పీయూష్ గోయల్‌తో పాటు రాష్ట్ర మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు ఉన్నారు. మహిళలతో మాట్లాడి వారు తయారు చేస్తున్న దుస్తులు, వారికి అందిస్తున్న శిక్షణ గురించి కేంద్రమంత్రి తెలుసుకున్నారు. ప్రపంచస్థాయి వస్త్రాలను గ్రామీణ మహిళలు తయారు చేయడం దేశానికే ఆదర్శమన్నారు. 7వ తరగతి విద్యార్హతతో 22 వేల మంది మహిళలకు అంతర్జాతీయ సౌకర్యాల మధ్య ఉపాధి కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రికి బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి వివరించారు. ఇక్కడ తయారయ్యే దుస్తులను పలు దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు, అమెరికా విధించిన అదనపు సుంకాల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బ్రాండిక్స్ దుస్తుల్లో 80 శాతం అమెరికాకే ఎగుమతి అవుతాయని, ప్రస్తుతం వర్క్ ఆర్డర్లు లేవని తెలిపారు. రాయితీలు, మినహాయింపులను ఇవ్వడంతోపాటు పాటు దేశీయ మార్కెట్‌లో 49 శాతం వస్త్రాలను విక్రయించుకోవడానికి అనుమతించాలని కోరారు. అవసరమైన చేయూతను అందిస్తామని పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఛైర్మన్‌గా వైడీ రామారావు




అమరావతి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఛైర్మన్‌గా కాకినాడకు చెందిన వైడీ రామారావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రామచంద్రరాజు (గుంటూరు), కోశాధికారిగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు (తిరుపతి) ఎన్నికయ్యారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గ ఎన్నికలను నిర్వహించారు. 22 జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు.. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రెడ్‌క్రాస్ ముఖ్య కార్యదర్శి, కార్యనిర్వాహక అధికారి ఏకే ఫరిడా తెలిపారు. నూతన సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. వీరు మూడేళ్లు పదవిలో కొనసాగనున్నారు. దేశంలోనే అత్యుత్తమ సేవలు అందించి ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని రామారావు తెలిపారు.

# అణుశక్తిని ప్రజాహితానికే ఉపయోగిస్తామని చెప్పా

**- ఐరాస సమావేశం గురించి ఎంపీ పురందేశ్వరి**



రాజమహేంద్రవరం: అణుశక్తిని భారత్ ప్రజాహితానికి మాత్రమే ఉపయోగిస్తుందని ఐరాస జనరల్ అసెంబ్లీలో స్పష్టంగా చెప్పినట్లు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బార్బడోస్‌లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటేరియన్ సదస్సు, ఐరాస సమావేశాలకు దేశం తరఫున వెళ్లిన ప్రతినిధి బృందానికి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం అరుదైన గౌరవమని ఆమె పేర్కొన్నారు. అందుకు ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. గూగుల్ భారీ పెట్టుబడితో విశాఖకు వచ్చినందున పెట్టుబడులకు పునాది పడినట్లేనన్నారు. వైకాపా పాలనలో పెట్టుబడి పెట్టిన వాళ్లంతా వెనక్కి వెళ్లిపోతే, ఇప్పుడు అనేక మంది ముందుకొస్తున్నారని పురందేశ్వరి గుర్తుచేశారు.

# బ్లూ ఎకానమీపై త్వరలో నూతన విధానం

**- భూ వైజ్ఞానిక శాఖ సలహాదారు శ్రీవాస్తవ**




విశాఖపట్నం: సముద్ర వనరుల ఆధారంగా చేపట్టే ఆర్థిక కార్యకలాపాలకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తేనుందని మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సలహాదారు శ్రీవాస్తవ తెలిపారు. ప్రస్తుతానికి నౌకా నిర్మాణాలు, మత్స్య సంబంధ ఉత్పత్తులపై ఆశించిన ప్రగతి కనిపిస్తున్నప్పటికీ సముద్ర గర్భ పరిశోధనలు, ఖనిజాల అన్వేషణలో ఇంకా సాధించాల్సి ఉందన్నారు. సముద్ర గర్భంలో చేపల వేట, బయోటెక్నాలజీ, తీర వనరులపై భారత ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. ఈ రంగంలో కొత్తగా వచ్చే అంకురాలను ప్రోత్సహించేందుకు నిధుల సహకారం అందేలా చూస్తున్నట్లు చెప్పారు. సీఐఐ సదస్సులో బ్లూ ఎకానమీపై చర్చ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ 'ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక చేసింది. కొత్తగా మరో 3 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో ఒకటి 2026 నాటికి అందుబాటులోకి వస్తుంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్లు వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్వహణలోకి వస్తాయి. సముద్ర అలల నుంచి విద్యుత్తు ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై చర్చలు సాగుతున్నాయి. సముద్ర గర్భంలో ఖనిజాల గుర్తింపు, మత్స్య సంబంధ ఉనికిని గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం' అని కృష్ణబాబు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు లక్ష్మణరావు, ప్రీమియర్ ఎనర్జీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతీ రోహిణి, ఆల్టనేటివ్ ఎనర్జీ కంపెనీ సీనియర్ సలహాదారు కార్తికేయ ఆనంద్, ఎర్నెస్టు అండ్ యంగ్ సంస్థ భాగస్వామి రాకేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# బ్రిస్క్ వాకింగ్, నార్మల్ వాకింగ్... గుండెకు ఏది మంచిది?

వాకింగ్ వల్ల బరువు తగ్గేందుకు కూడా మేలు చేస్తుంది. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే, ఈ వాకింగ్‌లో నడిచే వేగాన్ని బట్టి రెండు రకాల వాకింగ్‌లు ఉన్నాయి. ఒకటి వేగంగా నడవటం దీన్నే బ్రిస్క్ వాకింగ్ అంటారు. మరొకటి నెమ్మదిగా నడవటం. మంచి ఆరోగ్యం కోసం ప్రజలు సరైన ఆహారంతో పాటు తగిన వ్యాయామం కూడా చేస్తుంటారు. ఇందులో శారీరక వ్యాయామం కోసం ఎక్కువ మంది ప్రజలు వాకింగ్ చేస్తుంటారు. ఎందుకంటే వాకింగ్ చేయడం చాలా ఈజీ. రోజూ వాకింగ్ చేయడం వల్ల చాలా లాభాలు ఉంటాయని నిపుణులు కూడా చెబుతుంటారు. వాకింగ్ ఎఫెక్ట్‌తో దీర్ఘకాలంలో ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. వాకింగ్ వల్ల బరువు తగ్గేందుకు కూడా మేలు చేస్తుంది. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే, ఈ వాకింగ్‌లో నడిచే వేగాన్ని బట్టి రెండు రకాల వాకింగ్‌లు ఉన్నాయి. ఒకటి వేగంగా నడవటం దీన్నే బ్రిస్క్ వాకింగ్ అంటారు. మరొకటి నెమ్మదిగా నడవటం. ఈ రెండింటిలో ఏది బెస్ట్ అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలి. సాధారణ వేగంతో నడవటం కంటే బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. వేగంగా నడవటం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుంది. బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వేగంగా నడవటం వల్ల రక్తప్రసరణ బాగుంటుంది. దీంతో గుండె సంబంధిత సమస్యలు రావు.



అంతేకాదు.. సాధారణ వాకింగ్‌తో పోల్చితే బ్రిస్క్ వాకింగ్ వల్ల ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి. బరువు తగ్గాలనుకునేవారికి బ్రిస్క్ వాకింగ్ మంచి ఎంపిక. బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల ఫిట్‌నెస్ లెవెల్స్ పెరుగుతాయి. అలసట తగ్గుతుంది. నిత్యం ఎనర్జిటిక్‌గా ఉండొచ్చు. సాధారణ వాకింగ్‌తో పోల్చితే బ్రిస్క్ వాకింగ్ చేస్తే ఎండార్ఫిన్లు ఎక్కువగా రిలీజ్ అవుతాయి. దీని వల్ల ఒత్తిడి తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా మారుతుంది. శారీరక సమస్యలు ఉన్నవారు, కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారు, నరాల సమస్య ఉన్న వారు నెమ్మదిగా నడవటం మంచిది. నెమ్మదిగా నడిస్తే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ ఉన్నవారు రెగ్యులర్‌గా నెమ్మదిగా నడవటం మంచిది. నెమ్మదిగా నడవటం వల్ల మైండ్‌ఫుల్‌నెస్ అలవాటు అవుతుంది. దీని వల్ల మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# బొప్పాయి వీళ్లకు వేరీ డేంజర్



బొప్పాయి పండు.. తినేందుకు ఎంతో రుచికరంగా ఉండటమే కాదు..అనేక పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. అంతే కాదు.. ప్రతి సీజన్‌లోనూ దొరుకుతూ ఉంటుంది. పైగా దీన్ని చాలా మంది ఇష్టంగా తింటారు. సాధారణంగా ఇది ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. కానీ, బొప్పాయి తినడం వల్ల కొంతమందికి హాని కలుగుతుంది. బొప్పాయి పండులో ఉన్న పోషకాలు మరే ఫ్రూట్‌లో కూడా లేవంటారు ఆరోగ్య నిపుణులు. కుదిరినప్పుడల్లా బొప్పాయి పండుని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. బొప్పాయి పండును గుజ్జుగా చేసి చిన్న పిల్లలకు తినిపిస్తే చాలా మంచిదంటున్నారు నిపుణులు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తినకూడదు ఎందుకంటే దానిలో వారి ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపే కొన్ని అంశాలు ఉంటాయి. పచ్చి బొప్పాయిలో గర్భస్రావం కలిగించే పదార్థం ఉంటుంది. కాబట్టి, గర్భిణీ స్త్రీలు పండిన బొప్పాయిని మాత్రమే తినాలి. ఇది వారికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. వారు సురక్షితంగా ఉంటారు. జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా బొప్పాయి తినకుండా ఉండాలి. బొప్పాయిలో కొంతమందిలో కడుపులో చికాకు లేదా గ్యాస్ కలిగించే కొన్ని అంశాలు ఉంటాయి. దీనితో పాటు, బొప్పాయిని అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు లేదా వాంతులు వంటి సమస్యలు కూడా వస్తాయి. అందువల్ల, జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించి దాని పరిమాణంపై శ్రద్ధ వహించిన తర్వాత మాత్రమే బొప్పాయి తినడం మంచిది. మధుమేహ రోగులు కూడా బొప్పాయి తినకూడదు ఎందుకంటే ఇందులో రక్తంలో చక్కెర స్థాయిని పెంచే కొన్ని అంశాలు ఉంటాయి. దీనితో పాటు, బొప్పాయిలో సహజమైన తీపి కూడా ఉంటుంది, ఇది మధుమేహ రోగులకు హానికరం. ఒక వ్యక్తి మధుమేహానికి చికిత్స పొందుతుంటే, అతని ఆరోగ్యంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండకుండా వైద్యుడిని సంప్రదించిన తర్వాతే బొప్పాయి తినాలి. కొంతమందికి బొప్పాయి అలెర్జీ ఉండవచ్చు. ఇది దురద, దద్దుర్లు లేదా శ్వాస సమస్యలను కలిగిస్తుంది. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు కూడా బొప్పాయి తినకూడదు ఎందుకంటే దాని వినియోగం వారి గుండెను ప్రభావితం చేస్తుంది. దీనితో పాటు, బొప్పాయిలో ఉండే కొన్ని అంశాలు అధిక రక్తపోటు లేదా ఇతర గుండె సంబంధిత సమస్యలను పెంచుతాయి. అందువల్ల, గుండె రోగులు వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే బొప్పాయిని తీసుకుంటే మంచిది.

# గట్ హెల్త్‌కు బెస్ట్ ఫుడ్స్..!

మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందాలంటే జీర్ణక్రియ సక్రమంగా పనిచేయాలి. కడుపు ఆరోగ్యం బాగుంటే శరీరం ఫిట్‌గా ఉత్సాహంగా ఉంటుంది. అల్లం, చియా గింజలు, గ్రీన్ టీ, సోంపు వంటి సహజ ఆహారాలు జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా గట్ హెల్త్‌ను బలపరుస్తాయి. మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందాలంటే ఆహారం సరైన విధంగా జీర్ణం కావాలి. కడుపు ఆరోగ్యం బాగుంటేనే మనం ఫిట్‌గా, యాక్టివ్‌గా ఉంటాం. అందుకే జీర్ణక్రియను మెరుగుపరచి గట్ హెల్త్‌ను కాపాడే ఫుడ్స్ ని తీసుకోవాలి. ఆ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. అల్లంలో సహజంగానే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది జీర్ణక్రియను సులభతరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. వాంతులు, కడుపులో ఉబ్బరం లాంటి సమస్యలను తగ్గించడంలో అల్లం బెస్ట్‌గా పనిచేస్తుంది. అల్లంలో ఉండే జింజెరాల్ అనే పదార్థం జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. అందుకే ఫుడ్‌లో అల్లం వాడటం లేదా అల్లం టీ తాగడం వల్ల కడుపు ఆరోగ్యం మెరుగుపడుతుంది. చియా గింజల్లో ఉండే ఫైబర్, ప్రోటీన్ కడుపు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీ రోల్ ప్లే చేస్తాయి. ఇవి కడుపులో ప్రీబయోటిక్ జెల్‌ను తయారు చేసి మంచి బ్యాక్టీరియాకు



పోషకాలను అందిస్తాయి. చియా గింజల్లోని ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. గీన్ టీలో ఉండే పోలీఫినాల్స్ ప్రీబయోటిక్‌లుగా పనిచేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. సోంపులో అనిథోల్ అనే ముఖ్యమైన పదార్థం ఉంటుంది. ఇది గ్యాస్, బ్లోటింగ్ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. భోజనం చేశాక కొద్దిగా సోంపు నమిలితే జీర్ణక్రియ ఈజీగా జరిగి కడుపు హాయిగా ఉంటుంది.

# బెల్లం తిన్నా రోగాలు తప్పవట..!



బెల్లం ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. ముఖ్యంగా తెల్ల చక్కెరతో పోలిస్తే, బెల్లం ప్రతి పరిస్థితిలోనూ నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా..? అంటే ఆలోచించాల్సిందే.. బెల్లం ఇనుము, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలను కలిగి ఉంటుంది. కానీ, బెల్లం అధిక వినియోగం కూడా కొంత హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బెల్లంలో కేలరీలు, కార్బో హైడ్రేట్లు ఎక్కువగా కలిగి ఉంటుంది. అందువల్ల దాని అధిక వినియోగం బరువును పెంచుతుంది. మీరు మీ బరువును నియంత్రించాలనుకుంటే పరిమిత పరిమాణంలో మాత్రమే బెల్లం తినండి. ముఖ్యంగా మీరు ఊబకాయంతో బాధపడుతుంటే లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే బెల్లం వినియోగాన్ని తగ్గించండి. బదులుగా, తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలను అందించే పండ్లు, కూరగాయలను తినండి. బెల్లంలో సహజ చక్కెర ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రమాదకరం. దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. ఇది మధుమేహ సమస్యను పెంచుతుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు బెల్లం తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. బదులుగా వారు తమ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడే, చక్కెర తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. బెల్లం తీసుకోవడం వల్ల దంతాలకు కూడా హానికరం. ఇందులో ఉండే చక్కెర బ్యాక్టీరియాను కలిగిస్తుంది. ఇది దంతక్షయానికి కారణమవుతుంది. అందువల్ల, రాత్రి పడుకునే ముందు మీ దంతాలను పూర్తిగా శుభ్రం చేసుకోండి. తద్వారా బ్యాక్టీరియా ఉండదు. దీనితో పాటు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేసుకోండి. మౌత్ వాష్ వాడండి, తద్వారా మీ దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీనితో పాటు, ఎప్పటికప్పుడు దంతవైద్యునిచే చెక్ చేయించుకోవడం కూడా ముఖ్యం. బెల్లం అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం చూపుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను కలిగిస్తుంది. మీరు జీర్ణ సమస్యలను నివారించాలనుకుంటే బెల్లంను పరిమిత పరిమాణంలో తీసుకోండి. దానితో నీరు లేదా మజ్జిగ త్రాగండి. తద్వారా జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దీనితో పాటు జీర్ణక్రియను మెరుగుపరచడంలో, గ్యాస్ సమస్యలను నివారించడంలో సహాయపడే ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోండి. బెల్లం గర్భిణీ స్త్రీలకు కూడా హానికరం ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఇనుము ఉంటుంది. ఇది గర్భధారణ సమయంలో హాని కలిగిస్తుంది. ఇది తల్లి, బిడ్డ ఇద్దరిపైనా చెడు ప్రభావాన్ని చూపుతుంది. అందువల్ల గర్భిణీ స్త్రీలు బెల్లం తినే ముందు వైద్యుడిని సంప్రదించాలి. దీనితో పాటు వారు సమతుల్య ఆహారం తీసుకోవాలి. ఇందులో పండ్లు, కూరగాయలు తినడం కూడా ఉంటుంది. తద్వారా వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది.


# దాల్చిన చెక్క చేసే అద్భుతాలు..

దాల్చిన చెక్క వంటింట్లో సర్వసాధారణంగా వాడే ఒక మసాలా దినుసు. ఇది రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి అనేక లాభాలను అందిస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణ నుంచి గుండె ఆరోగ్యం వరకు.. జీర్ణక్రియ నుంచి ఇమ్యూనిటీ పెంపు వరకు దాల్చిన చెక్క అద్భుత ప్రయోజనాలు కలిగి ఉంది. దాల్చిన చెక్కతో ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు. దాల్చిన చెక్క కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు.. అది మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. దీన్ని మీ రోజు వారీ ఆహారంలో చేర్చుకుంటే ఎన్నో అద్భుతమైన లాభాలు పొందవచ్చు. మధుమేహం ఉన్నవారికి దాల్చిన చెక్క ఒక వరం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో చాలా బాగా పనిచేస్తుంది. మీ ఆహారంలో దాల్చిన చెక్కను చేర్చుకుంటే కొలెస్ట్రాల్, రక్తపోటు కంట్రోల్ లో ఉంటాయి. దాని వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దాల్చిన చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో బాగా హెల్ప్ చేస్తాయి. దాల్చిన చెక్కలో ఉండే కొన్ని ప్రత్యేక సమ్మేళనాలు మెదడు పనితీరును పెంచుతాయి. జ్ఞాపకశక్తికి సంబంధించిన వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. దాల్చిన చెక్క మంచి



జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ఇది పేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. దాల్చిన చెక్కలో ఉండే యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్లతో పోరాడి, మీ ఇమ్యూనిటీని పెంచుతాయి. దాల్చిన చెక్క బరువు తగ్గించడంలో కూడా బాగా పనిచేస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేసి ఆకలిని తగ్గిస్తుంది. ఫలితంగా మీరు ఈజీగా బరువును కంట్రోల్ చేయొచ్చు. దాల్చిన చెక్కను మీ డైట్‌లో చేర్చుకుని ఈ ఆరోగ్య లాభాలను పొందండి. అయితే ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే నిపుణుల సలహా తీసుకోవడం మర్చిపోవద్దు.


# రోజుకు 15 నిమిషాలు స్కిప్పింగ్ చేస్తే చాలు..!



స్కిప్పింగ్ రోజూ కేవలం 15 నుంచి 20 నిమిషాలు చేస్తే చాలు.. బరువు తగ్గడమే కాకుండా కండరాలు బలంగా మారుతాయి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. స్ట్రెస్ తగ్గి, శరీర సమన్వయం పెరిగి, మొత్తం బాడీ కి ఫిట్‌నెస్ లభిస్తుంది. స్కిప్పింగ్ రోజూ చేస్తే బాడీకి చాలా లాభాలు వస్తాయి. నిపుణులు ఏం చెబుతున్నారంటే.. ఇది కేవలం కేలరీలను బర్న్ చేయడమే కాదు.. కండరాలను స్ట్రాంగ్‌గా చేయడం, గుండె, ఎముకల ఆరోగ్యాన్ని పెంచడం, మైండ్‌ను ఫ్రెష్‌గా ఉంచడం వంటి బెనిఫిట్స్ కూడా ఇస్తుంది. రోజుకు 15 నుంచి 20 నిమిషాలు చేసినా చాలు. మంచి మార్పు కనిపిస్తుంది. స్లోగా స్కిప్పింగ్ చేసినా కూడా బాడీ చాలా కేలరీలను బర్న్ చేస్తుంది. ఫాస్ట్ బర్నింగ్.. ఫాస్ట్‌గా చేస్తే గంటకు 1000 కేలరీల వరకు బర్న్ చేయొచ్చు. ఫ్యాట్ కరిగిపోతుంది.. ఈ కేలరీల ఖర్చు శరీరంలో ఉన్న కొవ్వును తగ్గిస్తుంది. అందుకే బరువు తగ్గడం వేగంగా జరుగుతుంది. మంచి షేప్.. ఒకేసారి బాడీలోని చాలా కండరాలు పనిచేయడం వల్ల బరువు తగ్గడంతో పాటు కండరాలు కూడా బలంగా తయారవుతాయి. స్కిప్పింగ్ చాలా పవర్ ఫుల్ వ్యాయామం. కేవలం 10 నిమిషాలు చేస్తే.. అది 30 నిమిషాలు జాగింగ్ లేదా సైక్లింగ్ చేసినంత ఎనర్జీని ఖర్చు చేస్తుంది. మెటబాలిజం పెరుగుతుంది.. రోజూ స్కిప్పింగ్ చేస్తే మెటబాలిజం రేటు పెరుగుతుంది. అంటే వ్యాయామం పూర్తయినా కూడా బాడీ కేలరీలను బర్న్ చేస్తూనే ఉంటుంది. స్టామినా పెరుగుతుంది.. స్కిప్పింగ్ ఒకేసారి కాళ్లు, చేతులు, భుజాలు, పొట్ట, వెన్ను కండరాలను పని చేయిస్తుంది. అందుకే కండరాలు బలంగా మారి, మీ స్టామినా కూడా పెరుగుతుంది. గుండె ఆరోగ్యం.. స్కిప్పింగ్ వల్ల గుండె వేగం పెరిగి బ్లడ్ సర్క్యులేషన్ మెరుగుపడుతుంది. దీంతో గుండె కండరాలు బలంగా మారతాయి. ఎముకలకు బలం.. ఇది ఒక బరువు మోసే వ్యాయామం కాబట్టి.. ఎముకలపై కొంచెం ఒత్తిడి ఏర్పడి వాటి బలం పెరుగుతుంది. మెంటల్ హెల్త్.. స్కిప్పింగ్ చేసినప్పుడు విడుదలయ్యే ఎండార్ఫిన్స్ స్ట్రెస్, ఆందోళనలను తగ్గిస్తాయి. దాంతో మనసు ప్రశాంతంగా, హ్యాపీగా ఉంటుంది. బాడీ సమన్వయం.. స్కిప్పింగ్ చేస్తే చేతులు, కాళ్లు, కళ్ళు ఒకేసారి పనిచేయాలి. దీని వల్ల బాడీ బ్యాలెన్స్ బాగా మెరుగుపడుతుంది. రైట్ రోప్.. మీ హైట్‌కు తగ్గ తాడును ఎంచుకోండి. అలాగే మంచి స్పోర్ట్స్ షూస్ వేసుకుంటే గాయాలు కాకుండా ఉంటాయి. వార్మప్ మస్ట్.. వ్యాయామం మొదలుపెట్టే ముందు కనీసం 5 నుంచి 10 నిమిషాలు వార్మప్ చేయండి. సరైన ప్రదేశం.. కాంక్రీట్, గట్టి నేలపై కాకుండా, చెక్క ఫ్లోర్ లేదా రబ్బరు మ్యాట్‌పై స్కిప్పింగ్ చేయడం వల్ల మోకాళ్లపై ప్రెషర్ తగ్గుతుంది. డైట్ ఇంపార్టెంట్.. కేవలం స్కిప్పింగ్ చేస్తేనే సరిపోదు. దానికి సరైన ఆహారం, ఇతర వ్యాయామాలు కూడా తోడైతేనే మంచి రిజల్ట్స్ కనిపిస్తాయి. స్కిప్పింగ్ అనేది సింపుల్‌గా, తక్కువ ఖర్చుతో చేసే వ్యాయామం. రోజుకు కేవలం 15 నుంచి 20 నిమిషాలు చేస్తే బరువు తగ్గడంతో పాటు.. చాలా హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చు.

# నెలసరిలో వచ్చే నొప్పి వల్ల పిల్లలు పుట్టరా?

మహిళలు ఇంట్లో ఉంటారు వారికి ఏం టెన్షన్. హాయిగా తింటారు పడుకుంటారు అనే వారు చాలా మంది ఉన్నారు. కానీ ఒక ఆడపిల్లగా పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకు ఆమెకు చాలా కర్తవ్యాలు ఉంటాయి. అందులోనూ చాలా ఆచారాలు కూడా ఉంటాయి. కొన్నింటిని ఆమె మాత్రమే భరించాలి. అందులో భాగంగానే ఏ మగవారు కూడా అనుభూతి చెందలేని కొన్ని సమస్యలు మహిళలకు మాత్రమే ఉంటాయి. నెలసరి, గర్భం, బాలింత, విదవరాలు వంటివి కేవలం అమ్మాయికి మాత్రమే సొంతం. ఇక నెలసరి వచ్చినా ఏది జరిగినా ఇంట్లో పనులు చేయకుండా ఉంటే ఆ ఇంట్లో ఏ పని ముందుకు సాగదు. మరి కొందరికి నెలసరి సమయంలో చాలా కడుపు నొప్పి వస్తుంటుంది. ఇలా కడుపు నొప్పి వస్తే పిల్లలు పుట్టరనే ఓ నమ్మకం కూడా ఉంది. మరి ఇది ఎంతవరకు కరెక్ట్. దీనిమీద వైద్యులు ఏమంటున్నారు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. అయితే నెలసరి సమయంలో కడుపు నొప్పి ఎందుకు వస్తుంది? ఏ విధమైన నొప్పి అనే విషయాల మీద పిల్లలు పుడతారా? లేదా అనేది ఆధారపడి ఉంటుందట. నెలసరి మొదలైన దగ్గర నుంచి కడుపు నొప్పి ఉంటే అది కామన్ కడుపునొప్పి అంటున్నారు వైద్యులు. దీని వల్ల కడుపునొప్పి మాత్రలు కూడా వేసుకోవచ్చుట. దీని వల్ల పిల్లలు పుట్టరనే సమస్య లేదట. అయితే కొందరిలో 30–



35 సంవత్సరాల మధ్యలో ఉన్నప్పుడు నెలసరిలో కడుపు నొప్పి వస్తే దీనికి కారణాలు వేరుగా ఉంటాయి. ఫైబ్రాయిడ్, ఎడినోమినేషియా, పీసీఓడీ, గర్భసంచి ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు మీ కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాలలో మాత్రమే పెగ్రెన్సీసీ విషయంలో కాస్త ఇబ్బంది ఉంటుందట. అందుకే సెకండరీ స్టేజ్ లో డాక్టర్ ను సంప్రదించి వారి సలహాలు సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వయసు పెరుగుతున్న కొద్ది పిల్లలు పుట్టే అవకాశం మరింత తగ్గుతుంటుంది కాబట్టి జాగ్రత్త మస్ట్ అంటారు నిపుణులు.

# బివికే ఉన్నత పాఠశాలలో ఘనంగా సప్త శక్తి సంఘం కార్యక్రమం




గాజువాక, చైతన్యవారధి: గాజువాక విజ్ఞాన భారతి హైస్కూల్ నందు 210 మాతృమూర్తుల ద్వారా విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ వారిచే యోజన చేయబడిన సప్త శక్తి సంగం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్త్రీ మూర్తి కీర్తి, శ్రీ,వాక్కు, స్మృతి, మేధా, దృతి, క్షమా మొదలైన ఏడు గుణాల వికసింప చేసుకొని సప్తశక్తి రూపంలో మాతృత్వం యొక్క సింహాసనం మీద అధిరోహించి సమస్త మానవజాతి కళ్యాణం చేయడంలో సమ ర్థురాలు అయి సంపూర్ణ ప్రపంచానికి దిశా నిర్దేశం చేయగలు గుతుంది అని పాఠశాల ప్రబంధకారిణి సభ్యురాలు ఓలేటి భాస్కర శ్రీదేవి అన్నారు. ప్రకటనలు, పుకార్లు, అందవిశ్వాసాలు, సమాజ విద్రోహ శక్తుల కథనాలలో ఇరుక్కుపోకుండా వివేకపూర్వకమైన వ్యవహారంలో మాతృమూర్తులు జాగ్రత్తగా ఉండి ఈ సంస్కారాలను తర్వాతి తరానికి నేర్పించాలని ప్రధాన వక్త మోల్లేటి వీర్రాజు అన్నారు. హిందుత్వ సిద్ధాంతము, జీవన వ్యవహారము, జీవన దర్శనము, పండుగలు సాంప్రదాయాలు, జీవనశైలిని అనుసరించి పర్యావరణ అనుకూల శైలిని అనుసరించి గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కొనడంలో సమర్థుల సమర్థవంతులయ్యే దిశలో మాతృమూర్తులు ముందుకు వెళ్లాలని పాఠశాల ప్రిన్సిపల్. మహాలక్ష్మి వాడ్రేవు అన్నారు. ఈ సందర్భంగా విశిష్ట మహిళలకు సన్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సంయోజక్ ఏ స్వాతి పాఠశాల ఇంచార్జ్ బి కృష్ణవేణి, ప్రముఖ సంఘ సేవకురాలు ఈగలపాటి యువశ్రీ మాతృ మూర్తులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 87వ వార్డు పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ కార్యక్రమం

**- ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, బొండా జగన్నాథం (జగన్)**




గాజువాక, చైతన్యవారధి: గాజువాక నియోజకవర్గం జీవీఎంసీ 87వ వార్డ్ పరిధిలో పారిశుద్ధ కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాధం జగన్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లా డుతూ పారిశుద్ధ కార్మికులు ప్రజలకు చేస్తున్న సేవలు వర్ణించలేనివని, కరోనా, విజయవాడ కి వచ్చిన వరద విపత్తుల్లో వీరు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వీరి శ్రమను గుర్తించి వీరికి బట్టలు పంపిణీ చేయడం ఓ మంచి శుభ సూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సెక్రటరీ బొట్టా ప్రకాష్, రాజన్ రాజు, జెనసేన నాయకులు కర్రి నరసింగ రావు, రాజు, సుందర్ సునీల్, ఆదినారాయణ, పరమానందం, నారాయణరావు, తాతారావు, శివయ్యా, సచివాలయం సిబ్బంది జగన్నాధం, సంధ్య, సానిటరీ సిబ్బంది శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీబాలభారతి (సరస్వతి)భజన మండలి 30 వసంతాల వేడుకలు



గాజువాక, చైతన్యవారధి: జీవీఎంసీ 87 వార్డు లో కణితి గ్రామం, కళింగ వీధి కోదండ రామాలయ ప్రాంగణం లో నూతనం గా నిర్మించిన "శ్రీ శ్రీ శ్రీ భువనేశ్వరీ సహిత పంచముఖేశ్వర స్వామి" వారి దేవాలయం నందు శ్రీ బాలభారతి (సరస్వతి)భజన మండలి 30 వసంత సందర్భంగా"అర్ధ ఏకాహం" పేరిట వివిధ భజన మండళ్ళ కళాకారుల చే భగవన్నామ సంకీర్తన జరిగాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభించి 7 భజన బృందాలు పాల్గొంటున్నవి, చివరి భజనగా శ్రీకాకుళం జిల్లా గుంటుకుపేట గ్రామ "శ్రీవరసిద్ధి వినాయక దుర్గా భవాని మహిళ భజన బృందం" వారిచే ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని, అన్ని బృందాలకు సాల్వాతో సత్కరించి జ్ఞాపికలను. అందజేశారు (జ్ఞాపికలు సీపాన నరసింహారావు సౌజన్యం తో) కార్యక్రమం కొన్నికోటేశ్వర రావు ఆధ్వర్యంలో శ్రీబాల భారతి( సరస్వతి) భజన మండలి, కణితి ఆలయ కమిటి సభ్యులు ప్రగడ శంకర్రావు, బడగల రాము, దుగ్గపు దానప్పలు, బొడ్డ సూరిబాబు, ప్రగడ రవి, ప్రగడ అప్పలనాయుడు, పండి కృష్ణ, రామారావు, దుర్గపు శ్రీనివాస్ కణితి గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమాల్లో సాహిత్యంతోనే చైతన్యం




శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉద్యమంలో అనేక మంది కవులు, రచయితలు పాటలు, కవితలు రాసి సాహిత్యంతో చైతన్యం తీసుకొచ్చారని ఉత్తరాంధ్ర మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీఎస్ శర్మ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో జరుగుతున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో భాగంగా కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'కళింగాంధ్ర కవిత' అంశంపై అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంవీవీఎస్ శర్మ మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్, బాక్సైట్ ఉద్యమం పోరాటంలో కవులపాత్ర ఎంతో ఉందన్నారు. సిక్కోలు పుస్తక కమిటీ ఆధ్వర్యంలో పుస్తక మహోత్సవంతో సంక్రాంతి పండగ వాతావరణం తీసుకొచ్చారని హర్షం వ్యక్తం చేశారు. రచయత బడాన శ్యామలరావు మాట్లాడుతూ పద్య కవితకు ఉత్తరాంధ్రలో ప్రాధాన్యముందన్నారు. రచయిత సుధాకర్ మౌళి మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో దళితులపై జరిగిన దాడులు ప్రభావంతో చైతన్యవంతమైన కవితా సాహిత్యం వచ్చిందని పేర్కొన్నారు. వెంపటాపు సత్యం, భూషణం మాస్టారు, వంగపండు లాంటివారు సామాజిక విప్లవ సాహిత్య చైతన్యం తీసుకొచ్చారన్నారు. రచయత చింతాడ తిరుమలరావు మాట్లాడుతూ ఆధునిక కవిత్వానికి గురజాడ సాహిత్య జాడగా కవులందరికీ మార్గదర్శకులయ్యారని తెలిపారు. అనంతరం విశాఖ రచయితలు రచించిన సంకలనం 'తిమిరాన్ని తరిమివేద్దాం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయత లండ సాంబమూర్తి రచించిన 'ఆమెకు మిగలని ఆమె' పుస్తకాన్ని రచయత ఉదయకిరణ్ పరిచయం చేశారు. అదేవిధంగా రచయత పాయల మురళీకృష్ణ రచించిన సంకలనం 'గచ్చం సెట్టుకి అటూ ఇటూ' పుస్తకాన్ని లండ సాంబమూర్తి పరిచయం చేశారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలి



విజయనగరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పరిధిలో చేపడుతున్న పనులను రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, అలాగే ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని కల్పించాలని కలెక్టర్ ఎస్. రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారుల పనిదినాలు, కనీస వేతనాలు, పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనిదినాల కల్పనలో వెనుకబడితే సంబంధిత మండలాధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో కనీసం 1000 మంది ఉపాధి శ్రామికులకు తక్షణం పనులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా సరాసరి వేతనాన్ని రూ.300గా నిర్దేశించినప్పటికీ అన్ని మండలాల్లో ఈ స్థాయి వేతనం అందడం లేదని.. వచ్చే వారానికి ప్రతి మండలంలో రూ.300 పైబడి వేతనం వచ్చేలా పనులు కల్పించాలన్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఎక్కువ మంది శ్రామికులు పనులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మంజూరైన ఫారంపాండ్స్, కంపోస్ట్ పిట్స్, రింగ్ ట్రెంచెస్, ఫిష్ పాండ్స్ వంటి పనులపై శ్రామికులకు అవగాహన కల్పించాలని సూచించారు. మంజూరైన పుశువుల శాలలన్నింటినీ వెంటనే గ్రౌండ్ చేయాలని ఆదేశించారు.

# సింగపూర్‌కు దీటుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్



విశాఖపట్నం: సింగపూర్, దుబాయ్‌లలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు దీటుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంటోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. నెరెడ్కో ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహిస్తున్న 'నెరెడ్కో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025'ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, విశాఖపట్నంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను విమానయాన శాఖ మంత్రిగా ఉండటం వల్ల.. ఈ విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన అన్ని రకాల అనుమతులు వేగంగా మంజూరవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే దేశీయ, విదేశీయ సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు తరలివస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంతర్జాతీయ స్థాయిలో విశాఖలో నిర్మాణాలను చేపట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. దీన్ని సాకారం చేసేందుకు నెరెడ్కో వంటి సంస్థల కృషి అవసరమన్నారు. అనంతరం పలువురు ప్రముఖ వ్యాపారులను ఆయన సత్కరించడంతో పాటు ఫెస్ట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, పలు ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో నెరెడ్కో జాతీయ అధ్యక్షుడు హరిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్, విశాఖ అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అతిథులకు అసౌకర్యం లేకుండా భద్రత కల్పించాం



విశాఖపట్నం: నగరంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా భద్రత కల్పించామని నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగరానికి విచ్చేసిన పలు దేశాల ప్రతినిధులు, ప్రముఖుల కోసం నిరంతర నిఘాతో పాటు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో పికెట్స్, గార్డులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలను తనిఖీ చేశామన్నారు. నగరంలో పరిస్థితులకు అనుగుణంగా.. అను నిత్యం డ్రోన్లతో, సీసీ టీవీ కెమెరాలతో, బాడీ వార్న్ కెమెరాలతో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించామన్నారు. ఫీల్డ్ డెస్క్, ట్రాఫిక్ డెస్క్, సర్వైలెన్స్ డెస్క్, కాన్వాయ్ డెస్క్, డ్రోన్ డెస్క్, సెక్యూరిటీ డెస్క్, సోషల్ మీడియా డెస్క్, డాక్యుమెంటేషన్ డెస్క్, కమ్యూనికేషన్ డెస్క్, కమాండ్ డెస్క్‌లను ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ సజావుగా సాగేందుకు అస్త్రం యాప్‌ను వినియోగించడం వంటి చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించిన సీపీ.. పోలీసులకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కె.జె.పురంలో పిరమిడ్ ధ్యానశక్తి కేంద్రం ప్రారంభం




మాడుగుల: ప్రతి ఒక్కరు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్పశక్తి, ఆత్మజ్ఞానం, ఆత్మవిశ్వాసం చేకూరుతుందని, స్పిరిచ్చువల్ టాబ్లెట్స్ రీచెర్స్ ఫౌండర్ చైర్మన్ (యు.కె) పొలమరశెట్టి గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలో కె.జె.పురం గ్రామంలో సృష్టి పిరమిడ్ ధ్యాన శక్తి కేంద్రంను శనివారం స్థానిక కళ్యాణ మండపంలో ప్రారంభించారు. స్థానిక పిరమిడ్ నిర్వాహకులు ఆడారి చిన్నారావు, మల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా నాడి మండలం శుద్ధి జరిగి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మర్షి పిరమిడ్ ట్రస్టు ఫౌండర్ పొలమరశెట్టి ఈశ్వరమ్మ, మాట్లాడుతూ ధ్యానం వల్ల మానవుల్లో ఆందోళన, భయం, దుఃఖం, నిరాశ, మూఢ నమ్మకాలు సంపూర్ణంగా తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో పాపయ్యారాజుపాలెం పిరమిడ్ ట్రస్టుకు చెందిన పొలమరశెట్టి సతీష్, జ్యోతి, కామేశ్వరావు, వాణి మాట్లాడారు. అనంతరం అన్నసమారాధన జరిపారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



నర్సీపట్నం: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తెలిపారు. గంజాయి నిర్మూలనే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అభ్యుదయం పేరుతో పోలీసులు చేపట్టిన సైకిల్ యాత్ర ఈ నెల 14వ తేదీ సాయంత్రం నర్సీపట్నం చేరుకుంది. తిరిగి నర్సీపట్నం నుంచి యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మత్తుకు బానిసలై విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉద్యోగ, ఉపాధిపై దృష్టిసారించాలని సూచించారు. సైకిల్ యాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.విజయ్, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు గోవిందరావు, ఎల్.రేవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇతర బ్యాంక్‌ల ఖాతానంబర్లు ఇవ్వాలి



చింతూరు: పోలవరం పరిహారం చెల్లింపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ఖాతాదారుల ఖాతాలకు సంబంధించి ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఇతర బ్యాంకు ఖాతాలు మార్చి ఇవ్వాలని పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళవందనం సూచించారు. స్థానిక పోలవరం కార్యాలయంలో ఎస్డీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీజీబీ ఖాతాలు అందించిన నిర్వాసితులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. పరిహారం త్వరితగతిన చెల్లించేందుకు అధికారులు త్వరగా బిల్లులు పోలవరం కార్యాలయానికి సమర్పించాలని ఆమె ఆదేశించారు. పరిహారం చెల్లింపులో ఏవైనా సమస్యలు ఎదురైతే నిర్వాసితులకు సమాచారం ఇచ్చేందుకు వారి ఫోన్ నంబర్లను తప్పనిసరిగా సేకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీలు చంద్రశేఖర్, బాలకృష్ణారెడ్డి, అజరయ్య పాల్గొన్నారు.

# నాణ్యత లేకుంటే చర్యలు తప్పవు



శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలో మిల్లు జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి (వైఎస్సార్) కూడలి వరకు వరకు రహదారి పనుల్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అంసతృప్తి వ్యక్తం చేశారు. కాలువల్లో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేస్తున్న పనులు పాడవుతున్నా కనిపించడం లేదా అని మండిపడ్డారు. ఆర్అండ్ బి, కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో నాణ్యమైన పనులు చే యాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఫుట్‌పాత్ ర్యాంప్‌లు వంటివి వేసి వర్షం నీరు కాలువల్లోకి వెళ్లకుండా ఆటంకం కలిగిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డుకి ఇరువైపులా పేరుకుపోయిన భవన నిర్మాణాల వ్యర్థాలపై కలెక్టర్ విరుచుకుపడ్డారు. తక్షణం తొలగించాలని లేకుంటే మీపై చర్యలు తప్పవని మున్సిపల్ అధికారుల్ని హెచ్చరించారు. కలెక్టర్‌తో పాటు మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ అధికారులున్నారు.

# సింథటిక్ గ్యాస్ ఉత్పత్తిలోకి ఎన్‌టీపీసీ



బొగ్గును గ్యాస్‌గా మార్చే (గ్యాసిఫికేషన్) వ్యాపారంలోకి అడుగుపెట్టే యోచనలో ప్రభుత్వరంగ ఇంధన దిగ్గజ సంస్థ ఎన్‌టీపీసీ ఉన్నట్లు తెలుస్తోంది. సింథటిక్ గ్యాస్‌గా పేర్కొనే దీన్ని, రాబోయే 3-4 ఏళ్లలో ఏటా 5-10 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక సంప్రదింపుల కోసం టెండర్ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిర్వహించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు కోసం స్థలాన్వేషణలోనూ ఎన్‌టీపీసీ ఉందని ఆ వర్గాలు తెలిపాయి. విద్యుదుత్పత్తి కోసం తన సొంత గనుల నుంచి వెలికితీసిన బొగ్గునే ఎన్‌టీపీసీ వాడుతోంది. ఇప్పుడు ఈ బొగ్గును సింథటిక్ గ్యాస్ ఉత్పత్తికీ వాడాలని భావిస్తున్నట్లు సమాచారం. బొగ్గును గ్యాస్‌గా మార్చే ప్రాజెక్టులకు రూ.8,500 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను అందించే ప్రణాళికకు 2024లో కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇలా ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను ఎరువులు, పెట్రో రసాయనాల ప్రాజెక్టులకు వాడతారు. 2030 కల్లా బొగ్గు నుంచి 100 మిలియన్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

# బ్యాంకు రుణాల వృద్ధికి పండగ జోష్

**- 2025-26కు అంచనాలు పెంచిన ఇక్రా**



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) బ్యాంకుల రుణాల వృద్ధి అంచనాను 10.7-11.5 శాతానికి రేటింగ్ సంస్థ ఇక్రా పెంచింది. ఇంతకుముందు 10.5 శాతం వృద్ధిని అంచనా వేసింది. పండగ గిరాకీ, జీఎస్‌టీ సంస్కరణలు, నిధుల లభ్యత పెంచేందుకు ఆర్‌బీఐ చేపట్టిన చర్యలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకుల రుణాల వృద్ధి అంచనాను పెంచినట్లు తెలిపింది. అయితే బ్యాంకింగ్ వ్యవస్థలో గత కొన్నేళ్లుగా స్థిరంగా తగ్గుతూ వస్తున్న స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.3 శాతం వరకు పెరుగుతుందని పేర్కొంది. భారీ మొత్తంలో మూలధన నిధుల అవసరం ఉండకపోవచ్చని భావిస్తూ.. బ్యాంకింగ్ వ్యవస్థకు 'స్థిరత్వం'తో కూడిన అంచనాను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీలు) రుణాలిచ్చే విషయంలో అప్రమత్తతతో ఉండాలని ఇక్రా హెచ్చరించింది. కార్పొరేట్ రుణాల విభాగంలో గిరాకీ ఇప్పటివరకైతే ఆశించిన స్థాయిలోనైతే పుంజుకోలేదని పేర్కొంది. బ్యాంకుల రుణాల వృద్ధిలో రిటైల్, సూక్ష్మ, చిన్న మధ్యతరహా విభాగాలు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రూ.10.1 లక్షల కోట్ల మేర రుణాల మంజూరులో పెరుగుదల కనిపించింది. పండగ సీజను గిరాకీ, జీఎస్‌టీ రేట్ల కోత కారణంగా రెండో అర్ధభాగంలో రూ.9.4-10.9 లక్షల కోట్ల మేర రుణాల్లో వృద్ధి ఉండొచ్చని భావిస్తున్నామ'ని ఇక్రా అంచనా వేసింది. నికర వడ్డీ మార్జిన్ పుంజుకుంటుంటంతో కీలక వడ్డీ ఆదాయానికి కలిసి రావొచ్చని వివరించింది.

# గొడ్డు మాంసం, కాఫీ, పండ్లపై సుంకాల తొలగింపు

**- కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసిన ట్రంప్**




వాషింగ్టన్: గొడ్డు మాంసం, కాఫీ, ఉష్ణమండల పండ్లు వంటి విస్తృత శ్రేణి వస్తువులపై సుంకాలను తొలగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదు చేసిన వినియోగదారుల ఒత్తిడికి ప్రతిస్పందనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఆఫ్-ఇయర్ ఎన్నికలలో ఓటర్లు ఆర్థిక ఆందోళనలను తమ ప్రధాన సమస్యగా పేర్కొన్న తర్వాత ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ఫలితంగా వర్జీనియా, న్యూజెర్సీలలో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లకు విజయాలు లభించాయి. ఏప్రిల్‌లో చాలా దేశాలపై ట్రంప్ సుంకాలను విధించారు. అవి వినియోగదారుల ధరలను పెంచవని ఆయన చాలాకాలంగా చెబుతున్నారు. అయితే రికార్డు స్థాయిలో గొడ్డు మాంసం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అందుకే వాటిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ట్రంప్ కార్యనిర్వాహక ఉత్వర్తుపై సంతకం చేశారు. ప్రధానంగా గొడ్డు మాంసం ఎగుమతిదారు అయిన బ్రెజిల్‌పై ట్రంప్ సుంకాలు విధించడం ఇందుకు కారణమైంది. ఈ కార్యనిర్వాహక ఉత్తర్వు టీ, పండ్ల రసం, సుగంధ ద్రవ్యాలు, అరటి పండ్లు, నారింజ, టమోటాలు, కొన్ని ఎరువులపై కూడా సుంకాలను తొలగించనుంది.

# ఆ విమానాశ్రయాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు



గతంలోనే నిర్మించినా, విమానాల రాకపోకలు సాగకుండా నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు ఊపిరులూదాలని కేంద్రం భావిస్తోంది. చిన్న పట్టణాలు-మెట్రో నగరాల అనుసంధానానికి అమలు చేస్తున్న 'ఉడాన్' పథకం కిందకు వీటిని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తా సంస్థ'బ్లూమ్‌బర్గ్' తెలిపింది. ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉన్నట్లు వివరించింది. ఎంపిక చేసిన ఇలాంటి విమానాశ్రయాలకు, చౌక ధరల్లో విమాన సర్వీసులు నడిపిన పక్షంలో.. నెలవారీ సబ్సిడీ చెల్లింపులను విమానయాన కంపెనీలకు అందించాలనీ యోచిస్తున్నారు. అందువల్ల విమానయాన సంస్థలకు కూడా ఆర్థిక భారం లేకుండా ఉంటుంది. ఈ విమాన సర్వీసుల్లో విక్రయించిన సీట్ల ఆధారంగానూ సబ్సిడీ చెల్లింపులు చేయాలన్నది ప్రతిపాదన. ఈ విషయంపై విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించలేదు. 2016లో ఆవిష్కరించిన ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కింద దేశంలో 649 విమాన మార్గాలు ప్రారంభం కావడంతో పాటు, ప్రాథమిక మౌలిక వసతులున్న 93 విమానాశ్రయాల్లో కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త విమానాశ్రయాల వినియోగం పెరిగేందుకూ, నవీకరించిన ఈ పథకం కింద కృషి చేయనున్నారు. దేశంలోని 140 విమానాశ్రయాల్లో కనీసం 12 విమానాశ్రయాలకు గత డిసెంబరు-మార్చి మధ్య ప్రయాణికులే లేరు. ఇటువంటి వాటిని చైతన్యవంతం చేయడం కోసమే కేంద్రం ఈ అడుగులు వేస్తోందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

# సరికొత్తగా టాటా సియారా




ముంబయి: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తన ఎస్‌యూవీ సియారాను సరికొత్తగా శనివారం ఆవిష్కరించింది. కొత్త సియారా తన వారసత్వాన్ని, విలక్షణమైన డిజైన్‌ను నిలుపుకోవడంతో పాటు స్వేచ్ఛ, వ్యక్తిత్వం, అన్వేషణ స్ఫూర్తిని కలిగి ఉందని టీఎంపీవీ తెలిపింది. ఈ మోడల్ హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్ వంటి మధ్య తరహా స్పోర్ట్ వినియోగ వాహనాలతో పోటీ పడబోతోంది. కొత్త సియారాను అధికారికంగా ఈ నెల 25న విడుదల చేయబోతున్నట్లు టాటా మోటార్స్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ డిజైన్ హెడ్ మార్టిన్ ఉహ్లారిక్ పేర్కొన్నారు. టాటా సియారాను తొలిసారిగా 1991లో పరిచయం చేశారు.

# ఆరాధన అందరికి గుర్తుండిపోతుంది



'పొలిమేర' 'ఇట్లు మారేడుమిల్లి' వంటి చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైంది తెలుగమ్మాయి కామాక్షి భాస్కర్ల. ఆమె అల్లరి నరేష్ సరసన కథానాయికగా నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తన పాత్రపేరు ఆరాధన అని, ఆమె ఎక్కడి నుంచి వచ్చింది? ఏం చేస్తుందనే అంశాలు ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తాయని చెప్పింది. తన పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని, ఆరాధన లేకపోతే సినిమా కథే లేదని, అందరికి గుర్తుండిపోయే పాత్ర అవుతుందని తెలిపింది. 'హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు. కానీ నాయికల విషయంలో పరిమితులు కనిపిస్తాయి. అందుకే ప్రతి సినిమాలో ఛాలెంజింగ్ రోల్స్ ఎంచుకుంటున్నా. నేను అపోలో హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా ప్రాక్టీస్ చేశాను. ఇప్పుడు మాత్రం పూర్తిగా నటనకే సమయాన్ని కేటాయిస్తున్నా' అని చెప్పింది. ప్రస్తుతం తాను 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్నానని, మరో పెద్ద సినిమా ప్రకటన త్వరలో వస్తుందని, అలాగే 'పొలిమేర-3' కూడా ప్రారంభం అవుతుందని కామాక్షి భాస్కర్ల పేర్కొంది.

# సోషల్ ఇష్యూకి వినోదంతో విజయం



'ఒక మంచి వినోదం కోసం ప్రేక్షకులు ఎంతగా ఎదురు చూస్తున్నారో మా సినిమా సక్సెస్‌తో అర్థమైంది. ఆయ్, లిటిల్ హార్ట్స్ తర్వాత అలాంటి హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ అని అందరూ అంటున్నారు. తెలుగునేలపై అన్ని వైపుల నుంచీ మంచి టాక్ ఉంది. క్రిటిక్స్ సైతం ఈ సినిమాను అభినందనలు అందించారు. ప్రధాన తారాగణమంతా తమ నటనతో ఆకట్టుకోగా, సాంకేతికంగా అందరూ అద్భుతంగా పనిచేశారు' అంటూ ఆనందం వెలిబుచ్చారు నిర్మాతల్లో ఒకరైన మధురా శ్రీధర్ రెడ్డి. ఆయన నిర్వి హరిప్రసాద్‌రెడ్డితో కలిసి నిర్మించిన వినోదాత్మక చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ చిత్రానికి సంజీవ్‌రెడ్డి దర్శకుడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుందని ఆనందం వ్యక్తం చేస్తూ చిత్రబృందం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడారు. ఓ సోషల్ ఇష్యూకి వినోదాన్ని మిళితం చేసిన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తున్నదని, కొత్త కంటెంట్‌తో ఎక్కడా అసభ్యత లేని క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని అంతా కొనియాడుతుంటే చెప్పలేనంత ఆనందంగా ఉందని దర్శకుడు సంజీవ్‌రెడ్డి చెప్పారు.



# నిజజీవిత కథ దేవగుడి

అభినవశౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దేవగుడి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో బెల్లం రామకృష్ణారెడ్డి నిర్మించారు. డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకురానుంది. చిత్ర టీజర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. నిజజీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించామని, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు సినిమాకు పనిచేశారని దర్శకనిర్మాత తెలిపారు. టైటిల్ చాలా బాగుందని, ఈ కథ విన్నప్పుడు ఆసక్తికరంగా అనిపించిందని హీరో శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.కె.మదీన్ అండ్ రఘు కుంచె, రచన-దర్శకత్వం: నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి.

# వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు

స్వీయ దర్శకత్వంలో త్రినాథ్ కఠారి హీరోగా నటిస్తున్న చిత్రం 'ఇట్లు మీ ఎదవ'. 'వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు' ఉపశీర్షిక. సాహితీ అవాంచ కథానాయిక. బళ్లారి శంకర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 21న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ నైజాంలో, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆంధ్ర, సీడెడ్‌లో రిలీజ్ చేస్తున్నాయి. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని, నేటి యువతకు కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయని, కథలోని సందేశం కూడా ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవీప్రసాద్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్‌పీ పట్నాయక్, నిర్మాణ సంస్థ: సంజీవని ప్రొడక్షన్స్, రచన, దర్శకత్వం: త్రినాథ్ కఠారి.



# అంచనాలను నిజం చేసింది



'కాంత' చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, చాలా గ్యాప్ తర్వాత స్క్రీన్ మీద కనిపించడంతో అభిమానులు హ్యాపీగా ఫీలవుతున్నారని అన్నారు హీరో రానా. ఆయన దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన పీరియాడిక్ ఎంటర్‌టైనర్ 'కాంత' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రానా మాట్లాడారు. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ కెరీర్ బెస్ట్ పర్‌ఫార్మెన్స్ కనబరిచారని, విజువల్స్, మ్యూజిక్‌లాంటి అంశాలు ఉన్నత ప్రమాణాలతో ఉన్నాయనే ప్రశంసలొస్తున్నాయని చెప్పారు. 'ఇండిపెండెంట్ ఆర్ట్ సినిమాలంటే నాకూ, దుల్కర్‌కు బాగా ఇష్టం. అందుకే ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించాం. మా టీమ్ అందరి అంచనాలను నిజం చేసిన చిత్రమిది. ఇది ఏ నటుడి బయోపిక్ కాదు. 50 దశకం నాటి కథ కాబట్టి అప్పటి సినిమాల రిఫరెన్స్‌లను చూపించాం' అన్నారు. తనకు చిన్నప్పటి నుంచి పాత సినిమాలంటే ఇష్టమని, ఈ సినిమా కోసం సావిత్రి, శ్రీదేవి నటించిన చిత్రాల్ని చూశానని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే చెప్పింది.



# తర్వాత సినిమా బోయపాటితో?

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే ముందే పూర్తి కానున్నదని సమాచారం. మరి ఈ సినిమా తర్వాత బన్నీ ఎవరితో చేస్తారు? అనేది ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే కొంతమంది దర్శకులతో బన్నీ సంప్రదింపులు కూడా మొదలుపెట్టినట్టు సమాచారం. ఆ వరుసలో బోయపాటి శ్రీను ముందున్నట్టు తెలిసింది. అట్లీ సినిమా తర్వాత అల్లు అర్జున్ నటించేది బోయపాటి దర్శకత్వంలోనే అని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అల్లు అర్జున్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో 'సరైనోడు' సినిమా వచ్చింది.

CHAITANYA VAARADHI" Telugu Daily Printed, Published and owned by Bonda Gopinadha Rao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Published at D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021.and Printed at Chaitanya Vaaradhi Printers, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Editor : Bonda Gopinadharao, D.No. 3-9, Bharanikam village&post, Paravada Mandalam, Visakhapatnam-531 021. Cell : 9848682422, RNI.NO.APTEL\2006\18521, Postal Regd.No. ANK/0017/2015/2017 E-mail: chaitanyavaradhi@gmail.com